జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 12 సంచిక 209 విశాఖపట్నం | శుక్రవారం 16 ఏప్రిల్ 2021 | 8 పేజీలు | వెల : 5.00

# కోవిడ్ వ్యాక్సినేషన్‌లో రికార్డు:జగన్



అమరావతి,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:కోవిడ్ నివారణ, కరోనా వాక్సిన్‌పై క్యాంప్ కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. సమీక్ష సందర్భంగా సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..నిన్న అత్యధికంగా 6.21 లక్షల వాక్సిన్లు ఇచ్చాం. ఇది ఒక రికార్డు. ఇందుకు ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నాను అన్నారు. మీరంతా ఎంతో చొరవ చూపి పని చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, పీహెచ్‌సీల సిబ్బంది కూడా అందరూ సమష్టిగా పని చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. రికార్డు స్థాయిలో వాక్సిన్ ఇవ్వడం జరిగింది. ఆ విధంగా మనం అనుకున్న లక్ష్యం సాధించాము. రోజుకు 6 లక్షల వాక్సిన్లు ఇవ్వాలన్నది మన లక్ష్యం దాన్ని సాధించాము. ఇక ముందు కూడా అలాగే చేయాలి. ప్రస్తుతం వాక్సిన్లు లేవు, కాబట్టి వాటి కోసం లేఖ రాయండి. అవసరం అనుకుంటే నేను కూడా లేఖ రాస్తానన్న ముఖ్యమంత్రి.

**104 కాల్ సెంటర్‌కు మరింత ప్రాచుర్యం:**

ఇవాళ్టి నుంచి 104 కాల్ సెంటర్‌పై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించాలి. ఎవరికైనా చికిత్స, బెడ్ కావాలంటే ఆ కాల్ సెంటర్ ద్వారా సేవలందించాలి. హెూం ఐసొలేషన్, కోవిడ్ కేర్ సెంటర్ లేదా ఆస్పత్రిలో చేర్చడానికి వైద్యుల సూచనల మేరకు సేవలందించాలి. అంబులెన్సు సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంల సహాయంతో రోగికి వేగంగా వైద్య సేవలందించాలి. హెూం ఐసొలేషన్‌లో కూడా వారిని ఫాలో అప్ చేయాలి. రోగి ఫోన్ చేసిన 3 గంటల్లోగా ఆస్పత్రిలో బెడ్ సమకూర్చాలి అన్న ముఖ్యమంత్రి.

గ్రీవెన్సుల కోసం 1902 నెంబరు కేటాయించండి. ఇక 104 నెంబరు కోవిడ్ సేవల కోసం ఈ రెండింటినీ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కోవిడ్‌కు సంబంధించిన ఏ సందేహం ఉన్నా 104కు ఫోన్ చేయాలని బాగా ప్రచారం చేయాలన్నారు ముఖ్యమంత్రి. దీన్ని కూడా ఇవాళ్టి నుంచి ప్రచారంలో చేర్చండి. అందుకు అవసరమైన ఫ్లెక్సీలు, హెూర్డింగ్‌లను బస్టాండ్ వంటి పబ్లిక్ ప్లేసెస్‌లో పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి.

కోవిడ్ పరీక్ష మొదలు.. వైద్యం, ఆస్పత్రులలో మెడిసిన్, శానిటేషన్, క్వాలిటీ ఆఫ్ ఫుడ్ వరకు.. ఏ మాత్రం రాజీ పడొద్దు. ఎక్కడా రోగులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు.

**ఛార్జీలపై దృష్టి పెట్టండి:**

ఒకవేళ రోగి ప్రైవేటు ఆస్పత్రిలో చేరాలనుకుంటే, ఎక్కువ ఛార్జీలు వసూలు చేయకుండా, వాటిని కూడా స్పష్టంగా నిర్దేశించండి. రోగులకు ఎక్కడా బెడ్ల కొరత ఉండకూడదు. అందువల్ల ఆరోగ్యశ్రీ జాబితాలో ఉన్న ఆస్పత్రులతో పాటు, ప్రైవేటు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న బెడ్ల వివరాలు కూడా అధికారుల దగ్గర ఉండాలన్న ముఖ్యమంత్రి. ఆస్పత్రులలో చికిత్స ఫీజులు, ఛార్జీలకు సంబంధించిన వివరాలను రోగులకు అర్ధమయ్యేలా ప్రదర్శించాలి. అలాగే బోర్డులపై ప్రదర్శించిన దాని కంటే ఎక్కువ వసూలు చేస్తే, ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా ప్రజలకు (రోగులకు) తెలిసేలా అన్ని వివరాలు ప్రదర్శించాలి. ఎక్కడా రోగి దోపిడికి గురి కాకుండా ఉండేలా.. అవసరమైన ఔషధాలు, ట్యాబ్లెట్లు, ఇంజెక్షన్ల రేట్లు కూడా స్పష్టంగా ప్రదర్శించాలి. ఎక్కడైనా అధిక ఫీజులు, ఛార్జీలు వసూలు చేస్తే, కఠిన చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి. ఆస్పత్రి కేర్, శానిటేషన్, నాణ్యమైన ఆహారం.. ఈ మూడు ప్రమాణాలు కోవిడ్ ఆస్పత్రులతో సహా, అన్ని ఆస్పత్రులలో ఉండేలా చూడాలి. క్వాలిటీ ఆఫ్ మెడికేషన్‌తో పాటు, సమయానికి మందులు అందించడం అన్నది కూడా చాలా ముఖ్యం. అన్ని ఆస్పత్రులలో ఇవన్నీ పర్‌ఫెక్ట్‌గా జరగాలి. అందుకోసం ఆస్పత్రులలో వాటిని పరిశీలించడానికి గతంలో మాదిరిగా కొందరు అధికారులకు బాధ్యతలు అప్పగించాలి. జిల్లాలలో కూడా ఆ ఏర్పాటు జరగాలన్న సీఎం.

**టెస్టింగ్ ముఖ్యం:**

టెస్టింగ్ చాలా ముఖ్యం. కోవిడ్ పేషెంట్ ప్రైమరీ కాంటాక్టులందరికీ పరీక్షలు చేయాలి. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కూడా పరీక్షలు చేయాలి. పరీక్ష చేయించాలనుకున్న ఎవరైనా వెళ్లి, దాన్ని చేసుకునే విధంగా ప్రతి పీహెచ్‌సీలో **(మిగతా 2లో...)**



## ఢిల్లీలో వారాంతపు కర్ఫ్యూ : సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ ,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: పెరుగుతున్న కొవిడ్ కేసుల మధ్య ఢిల్లీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. మహమ్మారిని కట్టడి చేసేందుకు ఢిల్లీలో వారాంతపు కర్ఫ్యూ విధిస్తున్నట్లు సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. శుక్రవారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని ఆసుపత్రుల్లో బెడ్ల కొరత లేదని, ప్రస్తుతం ఐదువేల పడకలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఢిల్లీలో కొవిడ్ పరిస్థితిపై గురువారం లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌తో సమావేశమయ్యారు. అత్యవసరమైన సేవలను అందించే వారికి కర్ఫ్యూ పాసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మాల్స్, జిమ్‌లు, స్పాలు, ఆడోటోరియంలు పూర్తిగా మూసివేయనున్నట్లు చెప్పారు. సినిమా హాళ్లు 30 శాతం సామర్థ్యంతో మాత్రమే పని చేస్తాయని, రెస్టారెంట్లలో భోజనం చేసేందుకు అనుమతించమని, కేవలం పార్శిల్స్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం రికార్డు స్థాయిలో కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 17వేలకుపైె పాజిటివ్ కేసులు నమోదవగా.. 104 మంది మరణించారు.

## ‘పవన్ కళ్యాణ్ నటుడు, చంద్రబాబు సహజ నటుడు?’:సజ్జల



తాడేపల్లి,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: ‘పవన్ కళ్యాణ్ నటుడు.. చంద్రబాబు రాజకీయాల్లో సహజ నటుడు’ అని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. టీడీపీ, బీజేపీ అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లోనే ప్రజలు ఈ రెండు పార్టీలను ఛీ కొట్టినా వారిలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశామన్నది ఆ పార్టీ నేతలు చెప్పలేకపోతున్నారని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకే, ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని చురకలంటించారు.కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ప్రభుత్వం, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిందని సజ్జల పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన సొమ్మును నేరుగా వారి ఖాతాలోకే జమ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చేసిన రాళ్లదాడి హైడ్రామాను ప్రజలు గమనించారన్నారు. ‘టీడీపీ పనైపోయింది’ అని ఆ పార్టీ రాష్ట్ర అ?ధ్యక్షుడు అచ్చెన్నాయుడే స్వయంగా చెప్తున్నారని విమర్శించారు. లోకేష్ దెబ్బకు టీడీపీ దివాళా తీసిందని ఆ పార్టీ నేతలే అంటున్నారని, దీన్నిబట్టి ఆ పార్టీ నేతలకి టీడీపీ వట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలిసిపోతుందన్నారు.

## రాళ్లదాడి పేరుతో చంద్రబాబు సానుభూతి డ్రామా: పెద్దిరెడ్డి



తిరుపతి,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: చంద్రబాబుపై రాళ్ల దాడి అవాస్తవమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు ఆరోపణలు అసత్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనే తమ అభ్యర్థిని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. “రాళ్లదాడి అంతా బూటకమని తేలింది. ఆ పేరుతో చంద్రబాబు సానుభూతి డ్రామా ఆడారు. టీడీపీ మూతపడటం ఖాయం. అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై చంద్రబాబు ఏం జవాబు చెబుతారని” మంత్రి పెద్దిరెడ్డి ప్రశ్నించారు.తిరుపతి ప్రజలను ఓటు అడిగే హక్కు చంద్రబాబుకు లేదని.. మతాన్ని రెచ్చగొట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు. లబ్దిదారులే తమ?కు ఓట్లు వేయాలనుకుంటున్నారని.. వాలంటీర్లను ప్రభావితం చేయాల్సిన అవసరం లేదని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు.

## ఏపీలో కొత్తగా 5,086 కరోనా కేసులు!




అమరావతి,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: గడిచిన 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 35,741 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 5,086 కరోనా పాజిటీవ్‌గా నిర్ధారణ అయ్యింది. అదే విధంగా, కరోనా వలన 14 మంది మరణించారు. కాగా, గత 24 గంటల్లో ఈ మహమ్మారి బారినుండి 1,745 మంది క్షేమంగా కొలుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో మొత్తం, 9 లక్షల 3వేల 72 మంది కరోనా నుండి కోరుకుని క్షేమంగా డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 31,710 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇప్పటి వరకు ఏపీలో 1,55,70,201 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈమేరకు ఏపీ రాష్ట్రవైద్యారోగ్య శాఖ గురువారం కరోనాపై హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది.


## మదనపల్లెలో జడ్జి రామకృష్ణ అరెస్ట్

చిత్తూరు: ఇటీవలే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై తీవ్రవ్యాఖ్యలు చేసిన జడ్జి రామకృష్ణను మదనపల్లెలో అరెస్ట్ చేశారు. సీఎంపై తీవ్ర వ్యాఖ్యలు చేసినందునే ఆయనను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అనంతరం ఆయనను అరెస్ట్ చేసి పీలేరు వైపు తీసుకువెళ్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మదనపల్లెలో అరెస్ట్ చేసిన వ్యక్తిని ఇక్కడ కస్టడీలోకి తీసుకోకుండా వేరే ప్రాంతానికి తీసుకెళ్లడమేంటని రామకృష్ణ కుమారుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## టీడీపీ నేత కూన రవికుమార్ అరెస్ట్



శ్రీకాకుళం,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: ఏడు రోజులుగా అజ్ఞాతంలో వున్న టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పొందూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం లొంగిపోయారు. ఆయనను పోలీసులు రాజాం కోర్టుకు తరలించారు. రాజాం మండలం పొగిరి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రవికుమార్‌కు వైద్యులు కరోనా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రాజాం కోర్టుకు తరలించారు. పరిషత్ ఎన్నికల పోలింగ్ రోజున పొందూరు మండలం పెనుబర్తి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి ఇంటిపై అనుచరులతో కలిసి కూన రవికుమార్ దాడి చేసిన ఘటనలో ఆయనపై కేసు నమోదయ్యింది. దీంతో పోలీసులు తనను అరెస్టు చేస్తారనే భయంతో కూన ముందుగానే పారిపోయిన సంగతి విదితమే.



# సీఎం జగన్మోహనరెడ్డికి ప్రజల్లో కన్పిస్తోన్న అపూర్వ స్పందన

**90 శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు**
**రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని**



చిత్తూరు జిల్లా, సత్యవేడు, ప్రజాపాలన ప్రతినిధి ఏప్రిల్ 15 : సీఎం జగన్మోహనరెడ్డికి ప్రజల్లో అపూర్వ స్పందన కన్పిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు , వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు ( నాని ) అన్నారు . తిరుపతి ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇన్ ఛార్జిగా ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం , ఇతర నాయకులతో కలిసి మంత్రి కొడాలి నాని విస్తృతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు . ఈ సందర్భంగా మంత్రి కొడాలి నాని మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 17 వ తేదీన జరిగే తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం లాంఛనమేనని చెప్పారు . ఎంపీ అభ్యర్థిగా ఉన్న డాక్టర్ గురుమూర్తిని అత్యధిక మెజార్టీతో గెల్పించడవే లక్ష్యంగా నియోజకవర్గాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారాలను నిర్వహించామన్నారు . ముఖ్యంగా గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను , నాయకులను సమన్వయం చేసుకుంటూ భారీ పోలింగ్ నమోదయ్యే దిశగా చర్యలు చేపట్టామన్నారు . ఉప ఎన్నికలంటేనే ప్రజల్లో ఒక రకమైన భావన ఉంటుందని , కేవలం 65 నుండి 70 శాతం పోలింగ్ మాత్రమే నమోదయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు . దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనేలా చూస్తున్నామని , పోలింగ్ 85 నుండి 90 శాతం వరకు జరిగేలా కృషి చేస్తామన్నారు . పోలింగ్ శాతం పెరగడం వల్ల భారీ మెజార్టీ సాధ్యమవుతుందన్నారు . ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు , నాయకులకు వివరించామన్నారు . ఓటింగ్ కు రాని వారిని కూడా గుర్తించి ఓటు వేసేలా చూడాలని కోరామన్నారు . సీఎం జగన్మోహనరెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ ప్రతి కుటుంబానికి అందాయన్నారు . దీనిపై ఎవరిలోనూ ఇంకో అభిప్రాయం కన్పించలేదన్నారు . తెలుగుదేశం పార్టీ ఈ ఉప ఎన్నికల్లో ఓడిపోతుందనే విషయం ఆ పార్టీ నాయకులకూ తెలుసని అన్నారు . వైసీపీకి మెజార్టీ తగ్గించాలని , బీజేపీ కన్నా ఎక్కువ ఓట్లను పొందాలన్న లక్ష్యంతో టీడీపీ నాయకులు పనిచేస్తున్నారన్నారు . ఈ దిశగా చంద్రబాబు కోట్లాది రూపాయలను ఖర్చు చేసి సభలు , సమావేశాలను నిర్వహిస్తున్నారన్నారు .






**స్నేహ సంస్థల కార్యాలయం హైదరాబాద్ లో జన్మదినోత్సవం జరుపుకున్న మాస్టర్ కీ ఛానల్లో టెక్నికల్ వింగ్ లో పనిచేస్తున్న కె కృపా వరుణ్ , వేడుకకు హాజరై వరుణ్ ని ఆశీర్వదించిన స్నేహ సంస్థల చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు,మాస్టర్ కీ ఛానల్ ఎం డి,కె.క్రాంతి కుమార్, లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇనుగాల భీంరావు,మాస్టర్ కీ ఛానల్ సిబ్బంది, ప్రజాపాలన పత్రికా సిబ్బంది తదితరులు.**

# కోవిడ్ వ్యాక్సినేషన్‌లో రికార్డు:జగన్

**(మొదటి పేజీ తరువాయి)**

తగిన ఏర్పాటు చేయాలి. ఇంకా 104కు ఎవరైనా ఫోన్ చేసి, తాము పరీక్ష చేయించుకోవాలని అనుకుంటున్నామని చెబితే, వారు ఎక్కడికి పోవాలన్నది గైడ్ చేయాలి. అందువల్ల పీహెచ్‌సీ, సబ్ సెంటర్ లేదా విలేజ్ క్లినిక్.. ఎక్కడైనా సరే పరీక్ష (అది కావాలని కోరుకునే వారికి.. తమకు కోవిడ్ వచ్చిందని భావించే వారికి) చేయించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్న ముఖ్యమంత్రి.

**వాక్సినేషన్:**

మన ఫోకస్ ఏరియా వాక్సినేషన్. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ ముగించాలి. ఒక పద్ధతి ప్రకారం, ప్రణాళికా బద్ధంగా చేయాలి. రాష్ట్రంలో 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ వేయాలి. వాక్సిన్ వేయడం మనకు చాలా ముఖ్యం. హెల్త్‌కేర్ వర్కర్లు, ఫ్రంట్‌లైన్ వర్కర్లందరికీ తప్పనిసరిగా వాక్సిన్ వేయాలి. ఒక్కరు కూడా మిగలొద్దు. మనం పెట్టుకున్న లక్ష్యానికి అనుగుణంగా, కచ్చితంగా ఇంకా కొన్ని రోజులు రోజుకు 6 లక్షల వాక్సిన్లు వేయాలన్న ముఖ్యమంత్రి.

**హెూం క్వారంటైన్:**

హెూం క్వారంటైన్‌లో ఉన్న వాళ్లు కచ్చితంగా ఇళ్లలోనే ఉండేలా, రెగ్యులర్‌గా మానిటర్ చేయాలి. అందుకు తగిన ప్రొటోకాల్ రూపొందించుకోండి. తరుచూ సందర్శించడం వంటివి చేయాలి. అదే విధంగా వారికి ఏడు రకాల ట్యాబ్లెట్లు, క్యాప్సుల్స్‌తో కూడిన కోవిడ్ కిట్ తప్పనిసరిగా అందించాలన్నారు ముఖ్యమంత్రి.

**ఆక్సీజన్ సరఫరా:**


ఆస్పత్రుల్లో ఆక్సీజన్ సరఫరా పూర్తి స్థాయిలో ఉండాలి. విశాఖలో ప్రొడక్షన్ సెంటర్ నుంచి పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరిగేలా చూసి, దాన్ని అన్ని 108 ఆస్పత్రుల్లో తగినంత ఆక్సీజన్ ఉండేలా చూడండి. అదే విధంగా రెమ్‌డెస్‌విర్ ఇంజక్షన్లు. రోగులకు అవసరమైన ఇంజక్షన్లు అన్ని చోట్ల అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇంజక్షన్ లేకుండా ఏ ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా చూడాలన్న సీఎం.రాష్ట్రంలో పాజిటివిటీ రేటు ఇప్పుడు 6.03 శాతం ఉందని సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కోవిడ్ చికిత్స కోసం రాష్ట్రంలో 108 ఆస్పత్రులు వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉండగా వాటిలో 15,669 బెడ్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో ఇప్పుడు 4,889 బెడ్లు ఆక్యుపైడ్ కాగా, 1,987 వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని, నిన్నటి (బుధవారం) వరకు మొత్తం 22,637 మంది హెూం ఐసొలేషన్‌లో ఉన్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, డీజీపీ గౌతమ్ సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, కుటుంబ సంక్షేమ కమిషనర్ కాటమనేని భాస్కర్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, మున్సిపల్ శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర, ఉన్నత విద్యా శాఖ స్పెషల్ సీఎస్ సతీష్‌చంద్ర, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి వి.ఉషారాణి, పాఠశాల విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఆరోగ్యశ్రీ సీఈఓ డాక్టర్ ఎ.మల్లికార్జున్‌తో పాటు, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## ఆత్మనిర్భర భారతానికి కట్టుబడి ఉంటానని పునరుద్ఘాటించిన అమెజాన్

గుంటూరు ,ప్రజాపాలన ప్రతినిధి : తన ప్రధాన కార్యక్రమమైన సంభవ్ ప్రారంభ సభలో 250 మిలియన్ డాలర్లతో అమెజాన్ సంభవ్ వెంచర్ ఫండ్ ను ప్రారంభిస్తున్నట్లు అమెజాన్ ప్రకటించింది. దీని ద్వారా ఎస్ఎంబీ డిజిటైజేషన్, వ్యవసాయం, ఆరోగ్యరంగాల్లో సాంకేతిక పరిజ్ఞాన ఆవిష్కరణలపై దృష్టిపెట్టే స్టార్టప్‌లు, వ్యాపారాలలో అమెజాన్ పెట్టుబడులు పెడుతుంది. ఈ వెంచర్ ఫండ్ డిజిటల్ ఇండియాను సాధ్యం చేసేందుకు ఉత్సాహంగా ముందుకొచ్చే సాంకేతిక పరిజ్ఞాన స్టార్టప్‌లలో మదుపు చేస్తుంది. అమెజాన్ సంభవ్ కార్యక్రమంలో అమెజాన్‌కు రాబోయే సీఈవో, ప్రస్తుత ఏడబ్ల్యుఎస్ సీఈవో ఆండీ జాసీ, అమెజాన్ గ్లోబల్ సీనియర్ వీపీ కంట్రీహెడ్ అమిత్ అగర్వాల్ మధ్య జరిగిన సంభాషణల నేపథ్యంలో ఈ కొత్త కార్యక్రమాలను ప్రకటించారు. భారతదేశంలో అనంతంగా ఉన్న అవకాశాలను అందరికీ అందించాలన్న అమెజాన్ దీర్ఘకాలిక కట్టుబాటును వాళ్లు మరోసారి చెప్పారు.

## విన్ ఇన్ఫో సొల్యూషన్స్ కు సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఎంపిక



వేటపాలెం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ విన్ ఇన్ఫో సొల్యూషన్స్ కు బి.టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ గత సంవత్సర కాలముగా కరోనా కారణముగా కార్పోరేట్ కంపెనీల వారు కళాశాలలను సందర్శించి ప్రాంగణ ఎంపికలను నిర్వహించటం ఇబ్బందికరముగా మారిన సందర్భముగా ఇటీవల వర్చువల్ పద్ధతిలో విన్ ఇన్ఫో సొల్యూషన్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో బి.టెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఇద్దరు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు రూ. 2.40 లక్షలు వార్షిక వేతనంతో పాటు ఇతర అలలెన్సులు లభిస్తాయని కళాశాల ప్లేస్ మెంట్ ఆఫీసర్ యన్. పూర్ణచంద్రరావు అన్నారు. ఎంపికైన విధ్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ పి హరిణి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

## తురుమెళ్లలో అంబేద్కర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు






గుంటూరు, ఏప్రిల్ 15 ప్రజాపాలన ప్రతినిధి ::గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం తురుమెళ్ళ గ్రామం వెలివాడలో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం తురువెళ్ల లో పెట్టి 25. సంవత్సరముల సిల్వర్ జూబ్లీ వేడుకలు అంబేద్కర్ యూత్ వారి ఆధ్వర్యంలో 3 రోజులు మహనీయుడు బాబాసాహెబ్ డా,, బి ఆర్, అంబేద్కర్ జయంతి మహెూత్సవం అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలవమాలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు, ఈ సభకి అధ్యక్షులుగ ముక్కాలరాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు అంబేడ్కర్ ఈ యుగానికి



నవయుగ వైతాళికుడుని ఈ దేశానికీ నిజమైన దేశభక్తుడనీ కొనియాడారు ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథి, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొపెసర్ ఉవన్యాసల ఉద్యమల ఉపాధ్యాయుడు మనువాదుల గుండెలో అగ్ని బహుజన ప్రసంగాల ఖని ఆచార్య సి, ఖాసీం మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాలకు ఉన్న శక్తిని చూసి భయపడిన కొందరు ఆ విగ్రహాలకు అవమానపరిచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు, అంబేద్కర్ చేతులో పుస్తకం, ఆయన చూపుడు వేలు సమాజంలో తెస్తున్న చైతన్యం చూసి కొందరు ఓర్వలేక పోతున్నారని ప్రొ, ఖాసీం విచారం వ్యక్తం చేశారు సంఘసంస్కర్త మానవతా వాది ఆయనను చదివిన వారెవరు ఆయన్ను వ్యతిరేకించరనీ విద్యారంగంలో సంస్కరణలు చేపట్టిన వ్యక్తి సమాజం లో ప్రతివక్కరికి ఓటు హక్కు రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్ అంటే జ్ఞానానికి ప్రతిక విద్యలేకపోవడం వల్ల వివేకం లేదు విద్యవస్తే చైతన్యం వస్తుంది విద్యవల్ల ఆలోచనలు పెరుగుతాయి దాంతో ప్రపంచాన్ని అర్థం చేసుకోని మానప్రజల్ని చైతన్యం చేసి మహానీలు కలగన్న రాజ్యాధికారంలోకి వెళ్ళడానికి అవకాశం ఉంటుంది అదే అంబేడ్కర్ ఆలోచనఅని కొనియాడారు మరో విశిష్ట అతిథి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ మరియు చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ మరియు అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఫౌండర్, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సెంట్రల్ కమిటీ మెంబెర్, అంబేద్కర్ టీవీ డైరెక్టర్, గొప్ప మానవత వాది, డా,, గూడూరు సీతామహలక్ష్మి, మాట్లాడుతు బాబా సాహెబ్ అంబేద్కర్ స్త్రీజాతి విమోచకుడు ప్రపంచమేధావి, మానవహక్కుల యోధుడు, పీడిత తాడిత ప్రజల ఆశా జ్యోతి, మత బానిసత్వాన్ బానిసత్వాన్ని విడనాడ వలసిన ఆవశ్యకత ప్రతిఒక్కరిపై ఉందన్నారు అంబేద్కర్ మర్ఫు సిద్ధాంతాలను సమానంగా అనుసరించాలని కోరారు, ఎందరో విద్యార్థి జీవితాలకు వెలుగులు ప్రసాదించిన మహా మేధావి ప్రముఖ సైకాలజిస్టు పూలే అంబేద్కర్ రాజ్యాధికార రాష్ట్ర సమితి కన్వీనర్ డా,,ప్రత్యూష సుబ్బారావు, మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ ఆదర్శంగా తీసికోవాలని కోరారు సమాజంలో ప్రతి ఒక్కతల్లింద్రులు మీ పిల్లల విద్యభ్యాస విషయంలో మీకు ఎన్ని సమస్యలు ఎదురైనా వారిని స్కూలుకు పంపించి ఉన్నతమైన విద్ విద్యనభ్యసించేలా శ్రమించి ఉన్నత స్థాయికి ఎదిగేలా చూసినాడే అంబేద్కర్ నిజమైన నివాళులు అర్పించినట్లే హితవు పలికారు, ముక్కల కిరణ్ బాబూ స్వాగతం పలికారు, జె డి, చంద్రపాల్, ఈ సమావేశం లో అంబేద్కర్ యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు

## డాక్టరేట్ పొందిన సీఈసీ అధ్యాపకుడు



వేటపాలెం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: చీరాల ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ విభాగాధిపతిగా పనిచేస్తున్న దాసరి కళ్యాణ్ కుమార్ శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. నెట్‌వర్క్ సెక్యూరిటీ త్రూ ఏ మొబిల్ ఏజెంట్ బేస్డ్ ఇన్ ట్రూజన్ డిటక్షన్ ప్రేం వర్క్ అనే అంశంపై కళ్యాణ్ కుమార్ చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా గురువారం కాలేజీ ఆవరణలో జరిగిన సభలో సీఈసీ కాలేజీ సీఈఓ వలివేటి మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శి తేళ్ళ అశోక్ కుమార్, సీఈసీ ప్రిన్సిపాల్ వివీఅర్ఎల్. గంగాధర్, విభాగాదిపతులు అభినందించారు.

## రామానగర్‌లో చలివేంద్రం ఏర్పాటు



వేటపాలెం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి: యడవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని దేశాయిపేట పంచాయతీ రామానగర్‌లోని ప్రధాన రహదారి పక్కన బుధవారం మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని దేశాయిపేటకు చెందిన విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పింజల రామమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యడవల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ యడవల్లి నాగమల్లేశ్వరి, కన్వీనర్ యడవల్లి శివప్రసాద్, సెక్రటరీ వై. పుష్పరాజ్, సుబ్బారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## బేరానికి బెజవాడ రైల్వేస్టేషన్!

విజయవాడ: విజయవాడ రైల్వేస్టేషన్‌ను ప్రైవేటీకరించేందుకు రైల్వే బోర్డు రంగం సిద్ధం చేస్తోంది. రీ డెవలప్‌మెంట్ పేరిట 99 ఏళ్లు పాటు ప్రైవేటుకు ఇచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. అయితే దక్షిణ మధ్య రైల్వేలో ప్రాధాన్యం కల్గిన ఈ స్టేషన్‌ను లీజుకు ఇవ్వనుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గతంలోనే నిర్ణయం..**

విజయవాడ రైల్వే స్టేషన్‌ను కమర్షియల్‌గా హంగులతో ఆధునికీకరించేందుకు ప్రైవేటు బిడ్డర్లను పిలవాలని గతంలోనే రైల్వే బోర్డు నిర్ణయించింది. బిడ్డర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణను కూడా కోరింది. అప్పట్లో బిడ్డర్లు ముందుకు వచ్చినా రైల్వే నిబంధనల కారణంగా వెనకడుగు వేశారు. అప్పట్లో 30 ఏళ్లు లీజు కాలంగా ప్రతిపాదించడంతో ఉపయోగం ఉండదని బిడ్డర్లు భావించారు. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలకు గుత్తగా రైల్వేస్టేషన్‌ను దీర్ఘకాలం అప్పగిస్తే మంచిదని బోర్డు నిర్ణయించిన నేపథ్యంలో కొన్ని ఏ1 రైల్వే స్టేషన్లను పూర్తిగా ప్రైవేటీకరించేందుకు ఎంపిక చేశారు. అందులో విజయవాడ రైల్వేస్టేషన్‌ను కూడా చేర్చారు. దీనిపై రైల్వే కార్మిక సంఘాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

**ప్రాధాన్యం ఉన్న స్టేషన్..**

విజయవాడ రైల్వేస్టేషన్ 1888లో ప్రారంభమైంది. మొత్తం 30 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం 10 ప్లాట్ ఫారాలు ఉన్నాయి. ఈ స్టేషన్ గుండా కరోనాకు ముందు ప్రతి రోజు 250, ప్రస్తుతం 150 రైళ్లు నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీ గతంలో రోజుకు రెండు లక్షలు కాగా ప్రస్తుతం లక్ష వరకు ఉంటోంది.

**అన్ని సదుపాయాలూ ఉన్నా..**

ఇక ఈ స్టేషన్‌లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. పది ప్లాట్ ఫారాలు అనుసంధానం చేస్తూ మూడు ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలు ఉన్నాయి. వీటిలో ఒకటి పెద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఆరు మీటర్లు వెడల్పు 185 మీటర్లు పొడవుతో ఉంటుంది. రైల్వేస్టేషన్‌లో రిటైరింగ్ రూమ్‌లు, లిఫ్టులు, ఎస్కలేటర్ల సదుపాయాలూ ఉన్నాయి. జనరల్, నాన్ ఏసీ, ఏసీ రెస్ట్ రూమ్‌లు ఉన్నాయి.

ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 16, ఏప్రిల్ 2021

# భూముల వేలంలో మతలబేమిటి?

విశాఖ నగరంలోని భూములను వేలం ద్వారా అమ్మకానికి పెట్టాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగా 'నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' వారు గత నెల 30న నగరంలోని ఐదు ప్రదేశాలలో ఉన్న 17.48 ఎకరాల భూమిని ఉన్నది ఉన్నట్లుగా అమ్మాలని ఇ టెండర్లను ఆహ్వానించారు. నగరం నడిబొడ్డున ఆర్కే బీచ్‌ను ఆనుకుని ఉన్న 13.59 ఎకరాల భూమి కూడా ఇందులో ఉంది. ప్రభుత్వం ఈ భూములు ఎందుకు అమ్ముతోంది అన్నది ఒక అంశం కాగా, అలా అమ్మడం సహేతుకమేనా అన్నది మరొక అంశం. వాస్తవానికి గత సంవత్సరమే ప్రభుత్వం ఇలాంటి ప్రయత్నం చేసినా హైకోర్టు ఆదేశాల వల్ల నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే జగన్ ప్రభుత్వం 'బిల్డ్ ఎపి మిషన్' అమలుకు 2019 నవంబర్ 5న ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి పర్యవేక్షణా కమిటీ (ఎస్‌ఎల్‌ఎంసి)ని జిఓ నెం. 447 ద్వారా ఏర్పాటు చేసింది. సదరు జిఓ ఉపోద్ఘాతంలో కింది విధంగా పేర్కొన్నారు: 'ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులయిన నవరత్నాలు, నాడు%--%-నేడు, మౌలికసదుపాయాల అభివృద్ధి పనులు నిరంతరం స్థిరంగా కొనసాగడం కోసం రాష్ట్రంలో దీర్ఘకాలంగా ఖాళీగా పడి ఉన్న భూములను అమ్మి 'బిల్డ్ ఎపిమిషన్'కు ఆదాయం సమకూర్చుకోవాలి. ఈ పనిని సమర్థంగా చేయడానికి 'నేషనల్ బిల్డింగ్ కన్ స్ట్రక్షన్ కార్పొరేషన్' (ఎన్‌బిసిసి) అనే కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమతో ఒప్పందం చేసుకోవాలి'. ఇందులో మూడు అంశాల గురించి ప్రధానంగా ప్రస్తావించారు. మొదటిది- ఖాళీగా ఉన్న భూములు అమ్మడంబీ రెండవది- స్థిరమైన అభివృద్ధి సాధించడంబీ మూడవది- ఈ పనిని ఎన్‌బిసిసికి అప్పగించడం. ఈ అంశాలను ప్రభుత్వం ఎలా అమలు చేస్తోంది అన్నదాన్ని బట్టి ఈ భూముల అమ్మకం ప్రక్రియ చేపట్టడంలో ప్రభుత్వ ఉద్దేశ్యమేమిటన్నది అవగతమవుతుంది. మొదటి అంశాన్ని పరిశీలిస్తే ప్రభుత్వం నేడు అమ్మకానికి పెడుతున్న భూములేమీ ఖాళీగా లేవు. దీనికి భిన్నంగా ఇప్పటికే ఉన్న సంస్థలను ఖాళీ చేయించో, లేదా రద్దుచేసో అమ్మకానికి పెడుతున్నారు! ఉదాహరణకు విశాఖపట్నంలో నేడు అమ్మకానికి పెట్టిన (ఆర్కే బీచ్‌లో ఉన్న భూమి సహా) భూములను వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వం కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ మాల్ నిర్మాణం కోసం 'లులు' అనే సంస్థకు లీజుకు ఇచ్చింది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కేటాయింపును రద్దు చేసింది. ప్రభుత్వం ఆర్కే బీచ్ భూములను ప్రజావసరాలకు వినియోగిస్తుందని భావించి ప్రజలు ఆ రద్దును హర్షించారు. ఇప్పుడు అదే స్థలాన్ని అమ్మకానికి పెట్టడంలో ప్రభుత్వ ఆంతర్యమేమిటని ఆ ప్రజలే విస్తుపోతున్నారు! ఈ ప్రక్రియ కోసం గత సంవత్సరం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు పదివేల కోట్ల రూపాయల విలువ చేసే 1400 ఎకరాల భూమి రాష్ట్ర వ్యాప్తంగా 250 ప్రాంతాలలో ఉందని గుర్తించారు. ఈ భూమిని వివిధ దశలలో అమ్మాలని ప్రతిపాదించారు. ఇలా అమ్మకానికి పెడుతున్న స్థలాలు ఏవీ కూడా ప్రభుత్వం పేర్కొన్నట్లు ఖాళీ స్థలాలు కావు. ఎపిఐఐసి, ఇరిగేషన్, మునిసిపల్, రెవిన్యూ, ఆరోగ్య, జైళ్ల శాఖలకు చెందిన వివిధ ఆఫీసులు వీటిలో ఉన్నాయి. ఒక పక్క ప్రభుత్వ సంస్థలను ఖాళీ చేయించి మరీ అమ్మకానికి పెడుతూ, మరోవక్క నిరుపయోగంగా ఉన్న స్థలాలనే అమ్ముతామని నమ్మబలకడం నిస్సందేహంగా నయవంచనే. రెండో అంశం%--%స్థిరమైన అభివృద్ధి సాధించడం. భూములు అమ్ముకుంటూ పోతే తరుగుతాయే కానీ పెరగవు కదా! అలాంటప్పుడు ఇది స్థిరమైనది అని ఎలా భావిస్తాం? కొన్నాళ్ళకు ఈ భూములన్నీ అయిపోతే అప్పుడిక ఏవి అమ్ముతారు? స్థిరమైన ఆదాయమంటే ఉన్న సంపదను అమ్ముకోవడం కాదు. అందుకు భిన్నంగా సంపద మరింత పెరిగే చర్యలు చేపట్టడం. ఇది ప్రజల ఆదాయాలు పెరగడం- తద్వారా వారి కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వానికి పన్ను ఆదాయాలు పెరగడం. కేంద్రం నుంచి రావలసిన నిధులు రాబట్టుకోవడం, ప్రజా సంపద అన్యాక్రాంతం కాకుండా కాపాడడం ఈ చర్యలలో కొన్ని. కానీ ప్రభుత్వం ఇవేమీ చేయకుండా భూముల అమ్మకానికి తెగబడడం ఏ రకంగానూ సహేతుకం కాదు. ఇక మూడవ అంశానికి వస్తే, ప్రభుత్వం ఒప్పదం చేసుకున్న ఎన్‌బిసిసి కేంద్రప్రభుత్వ సంస్థ కాబట్టి ఎలాంటి అవతతవకలకు తావుండదని ఒక భావం కొంత మందికైనా కలగవచ్చు. అయితే ఈ సంస్థ కూడా నేడు కేంద్రప్రభుత్వ అమ్మకాల జాబితాలో ఉంది. అందువల్ల నేడో, రేపో ప్రైవేటుపరమే. అయితే ప్రస్తుతానికి ప్రభుత్వ సంస్థే కదా అని సరిపెట్టుకోవచ్చు. ఇక్కడే అసలు కథ అర్థం చేసుకోవాలి. అదేమిటంటే ఈ స్థలాల నుంచి అత్యధిక రాబడి సాధించేందుకు అవసరమైన సహకారం కోసం కెనడా రాజధాని టోరోంటో ప్రధాన కేంద్రంగా ఉన్న కొలియర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, అమెరికాలోని షికాగో ప్రధాన కేంద్రంగా ఉన్న జెఎల్‌ఎల్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ అనే సంస్థలను నియమించారు. ఈ రెండూ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రపంచంలోనే అతి పెద్ద బ్రోకర్ కంపెనీలు. దీని అర్థమేమిటంటే కేంద్రప్రభుత్వ సంస్థ ఎన్‌బిసిసి మాటున విదేశీ గుత్త కంపెనీలను రంగంలోకి దింపడం! అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థల మతలబు ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వం చెబుతున్నదానికి, చేస్తున్నదానికి అస్సలు సారూప్యతే లేదు. సరికదా దాని చర్య అనేక సందేహాలకు కూడా తావిస్తోంది. దీనికి తోడు ప్రభుత్వ వివేచననే ప్రశ్నించేలా చేస్తోంది. సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వ ఆస్తులను అమ్ముకోవడం వివేకవంతమైన ఆలోచనేనా అనే సందేహం కూడా కలుగుతోంది. ప్రభుత్వ ఆస్తులన్నీ అమ్మేయడమే తమ విధానమని ప్రకటించిన కేంద్రప్రభుత్వ బాటలోనే రాష్ట్రప్రభుత్వమూ పయనిస్తోందా అనే భావం ప్రజలకు తప్పక కలుగుతుంది.

ఇప్పుడు విశాఖ భూములతో ప్రారంభించి అనేక ప్రాంతాలలో భూములను అమ్మడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా అవగతమవుతోంది. వీటన్నింటికి మించి అసలు ఈ ప్రక్రియ ప్రారంభానికి విశాఖనే ఎంచుకోవడమేమిటి? ఇప్పటికే అనేక సంఘాలు, సంస్థలు, మేధావులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుని ఈ మొత్తం అంశంపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయవలసిన అవసరం ఉంది.



## సగటు జీవన చక్రం

వెనుకబడిన మనిషి పొదిలో
ఇమడలేని సుఖాలెన్నో
తరగబడిన జీవన తలలో
విరిగిపడిన ఆలోచనలెన్నో
ఉప్పుంటే పప్పుండదు
నిప్పుంటే కుండ వుండదు
అప్పుల రాశి కుప్పల కింద
గిట్టుబాటు కాని ధరల మంట
తుప్పు పట్టిన భరోసాలు
ముప్పు తెచ్చే అమ్మకాలు
సగటు జీవన గొంతులోకి
మెతుకు దిగని వైనాలు
పోట్లాటలు తన్నులాటలు
పోటీల పరోక్ష యుద్ధాలు
చట్టాలకు రంగులేసే తీరులు
చుట్టాలకు పట్టంగట్టే నైజాలు
అట్టడుగున మనిషి వైపు
చూడ్డానికి అడ్డుపడే
సర్కారుకు అంధత్వం
సమస్తం సుభిక్షమంటూ
లెక్కల పత్రంపై స్వర్ణాక్షరాలు
లిఖిత పూర్వక అబద్ధాలు
లొలుసుగుల్లేని రాజ్యమంటూ
ముసుగులేసే కళారత్నాలు
బహిరంగ నాటక ప్రదర్శనలు
రాబడిపై గుడ్డ కప్పే
రాబందులే స్వేచ్ఛాజీవులు
సగటు జీవన చక్రం కింద
నలిగిపోతున్న జీవితాలెన్నో.

## సోమరితనం నేర్పే పథకాలే అన్నీ!

ఇటీవల మద్రాస్ హైకోర్టు రాజకీయపార్టీలు మేనిఫెస్టోల ద్వారా ఇచ్చే ఉచిత వరాల వల్ల ప్రజలు సోమరులుగా మారుతున్నారని, ఈ ఉచిత వరాలను అవినీతిగా పరిగణించాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యల్లో ఎంతో నిజముంది. రాజకీయపార్టీలు ?సంక్షేమ రాజ్యం ముసుగులో ఓటు బ్యాంకు పథకాలను ప్రవేశపెడుతున్నాయి. స్వాతంత్ర్య ప్రారంభ కాలంలో పార్టీలు సామాజిక, ఆర్థిక మార్పుల కోసం నూతన పథకాలను తీసుకు వచ్చేవి. తద్వారా కొద్దో గొప్పో అభివృద్ధిని సాధించగలిగాం. ఇదే బాటలో, తర్వాతి కాలంలో రాజకీయపార్టీల హామీలు సామాజిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల వైపు మళ్ళాయి. నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, వైద్య సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, పాఠశాల భవనాలు, మౌలిక వసతులు మొదలైన అంశాల్లో కొత్త పథకాలతో హామీలు ఉండేవి. అట్టి పథకాల వల్ల దీర్ఘకాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. కానీ ప్రస్తుత రాజకీయపార్టీలు మాత్రం మొత్తం వ్యవస్థను ప్రభా వితం చేసే పథకాలుగాక ఓట్ల కోసం ఓటర్లకు వ్యక్తిగతంగా ప్రయోజనం కల్పించే పథకాలను రూపొందిస్తున్నాయి. సామాజిక భద్రత కల్పించే కొన్ని పథకాలు వ్యక్తులనే ఉద్దేశించినప్పటికీ వాటికి సంక్షేమ రాజ్యంలో ప్రజలందరి ఆమోదమూ ఉంటుంది. ఉదాహరణకు ఒక రూపాయికి కిలో బియ్యం, రైతు బీమా, 12 రూపాయలకే జీవిత బీమా... మొదలైనవి. కానీ ఈ వ్యక్తిగత ప్రయోజనాల పథకాలు ఇప్పుడు శ్రుతిమించాయి. సౌకర్య, విలాస వస్తువుల బహూకరణే ఎన్నికల హామీలుగా రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల్లో పేర్కొంటున్నాయి. టివీ సెట్లు, వాషింగ్ మిషన్లు, గ్రైండర్స్, బాలికలకు స్కూటీలు, మహిళలకు ప్రతినెల నగదు ఇలా అనేక తాత్కాలిక ప్రయోజన పథకాలను మ్యానిఫెస్టోలో పొందుపరచి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజలకు స్వావలంబన నేర్పాల్సిందిపోయి, వారిని పరాన్నజీవులుగా తయారు చేస్తున్నాయి. మద్రాసు హైకోర్టు పేర్కొన్నట్లు రాజకీయపార్టీలు ఇచ్చే ఇలాంటి హామీలకు ఆయా పార్టీల సొంత ఆదాయం నుంచి 10 శాతం నిధులు వసూలు చేసే విధంగా చట్టం తీసుకు రావాలి. రాజకీయపార్టీలు ఇచ్చే ఈ హామీలు సాంకేతికంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిలోకి రాకపోవచ్చు, కానీ మద్రాస్ హైకోర్టు చెప్పినట్లు ఆ హామీలను అవినీతిగా ఎందుకు చూడకూడదు? ఇది ఒక రకంగా ఓటుకు పరోక్షంగా డబ్బులు ఇవ్వడం కాదా? కనీసం ప్రజలైనా చైతన్యవంతులై పార్టీ హామీలను తిరస్కరించాలి. అప్పుడే నిజమైన సంక్షేమ రాజ్య స్థాపన జరుగుతుంది.

# దేశమా! దారికి రా!

ప్రస్తుతం మనదేశం మూడు అంశాలను జాగ్రత్తగా, లోతుగా అధ్యయనం చేసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమయిందని విజ్ఞులు, అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు.

ఆ మూడు అంశాలు ఇవి.

1) రాజకీయ పరిస్థితులు 2) ఆర్థిక పరిస్థితులు 3) అంతర్జాతీయ పరిస్థితులు. దేశభద్రత, అభివృద్ధి, సంక్షేమం ఈ మూడు అంశాల మీదనే ప్రధానంగా ఆధారపడి ఉన్నాయని అనుకోవడంలో తప్పు లేదు. కొన్ని సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న అనేక సంఘటనలు ఈ రకమైన చింతనకు, అనుమానాలకు తావిస్తున్న మాటను ఎవరూ కాదనలేని పరిస్థితి.

కోవిడ్ నేపథ్యంలో కలికాలం వచ్చేసిందని జాతకాలరాయుళ్ళు, నాడీగ్రంథ పండితులే కాకుండా దేశాల జ్యోతిష్యాలను గూడా రెప్పవేయకుండా చెప్పేవాళ్ళను పట్టించుకోవాల్సిన అవసరం లేనే లేదు. కానీ వాస్తవిక దృక్పథంతో ఒక్కొక్క అంశాన్ని విశ్లేషించి, పరిస్థితులను అవగాహన చేసుకుని, దేశం కోసం కొన్ని కఠినమైన దిద్దుబాటు చర్యలను, పాలకులు, ప్రజలు, తీసుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్న విషయాన్ని విస్మరించే రోజులు గడిచిపోయాయన్న నగ్నసత్యాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. ప్రజాస్వామ్యాన్ని మనసా వాచా పాటించాలని కోరుకుంటున్న మన ప్రజలూ, దేశమూ, అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందిన అద్భుతమైన రాజ్యాంగాన్ని పాటించక తప్పదు. రాజకీయంగా పార్టీలు, ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఈ మార్గదర్శక సూత్రాన్ని విస్మరిస్తున్న సంకేతాలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. అంతేకాదు రాజ్యాంగం ఏర్పరిచిన వ్యవస్థలు కొన్ని ఇప్పటికే కూలిపోయాయి, మరికొన్ని బీటలు వారాయి. ఇంకొన్ని నామమాత్రంగా మిగిలిఉన్నాయి. వెంటిలేటర్ మీద లేకుండా జీవిస్తున్న ఒకే ఒక అంగం, న్యాయవ్యవస్థ! ఆ వ్యవస్థ కొంతలో కొంత కట్టుదిట్టంగా పనిచేస్తుండడం వల్లనే, లెజిస్లేచర్, పరిపాలనా వ్యవస్థ నామమాత్రంగా పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ప్రజల అభ్యున్నతి కోసం ఏ ప్రభుత్వమైనా పాటుపడక తప్పదు. కానీ సంక్షేమ సాధన పేరుతో ప్రజలను అధోగతి పాలు చేస్తూ, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రజాస్వామ్య ముసుగులో అన్ని రకాలుగా ప్రదర్శిస్తూ, తాము ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాం అని మాయ మాటలు చెప్పే పాలకులను 'అన్ని రకాల సౌకర్యాలను వేము సమకూరుస్తాం. ఎలా నమ్మాలి? కేవలం మీరు ఇంట్లో కూర్చుని తినిపెడితే చాలు' అని నమ్మబలికే ప్రభుత్వాలను ఏం చేయాలి? కూడు, గూడు, బట్ట అనే చిన్నపాటి సూత్రం ఈవిధంగా ప్రజాస్వామ్యం పేరిట ఎన్నుకోబడ్డ పాలకుల నోళ్ళలో నాని, నాని, చివరకు ప్రజలు మాకు అన్నీ కావాలి అని అడిగే పరిస్థితిని తెచ్చిపెట్టాయా? అధికారం ముఖ్యం అనే ధోరణితో నిజమైన అభివృద్ధిని నీరుగార్చి ప్రజల స్వయంశక్తులను హరించే పరిస్థితిని ఈనాటి ప్రభుత్వాలు అన్ని రాష్ట్రాలలో కావాలనే కల్పిస్తున్నాయా? కష్టాన్ని కూడా ఇష్టంగా భరించే శక్తిని ప్రజల పరిధిలోంచి కావాలనే దూరం చేస్తున్నాయా?రాజకీయంగా ఇది అన్ని రాష్ట్రాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న విచిత్రమైన, క్లిష్టమైన సమస్య. దీనికి తోడు దేశంలో ఎన్నికల తతంగం కేవలం పార్టీలు అధికారంలోకి రావడం కోసమే. ప్రజల అభ్యున్నతి పేరుతో అధికారంలోకి వచ్చి ఆ తర్వాత అధికారం నిలుపుకోవడానికే పాలన. ప్రజల అభ్యున్నతి కోసం కాదు అనే వింతధోరణి ఈ మధ్య విచిత్రంగా బలపడుతున్నది. సామ, దాన, భేద, దండోపాయాలతో అధికారం కోసం ఏదైనా చేయొచ్చు, వాగ్దానాలు కేవలం నీటి మూటల్లాంటివే, మానిఫెస్టోల్లో మాటల గారడీకి మాత్రమే అనే విచిత్ర ధోరణి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్నది. ప్రభుత్వం ఇంతకు పూర్వం ఏదైనా మాట చెబితే అది శాసనంగా రూపుదిద్దుకుని ప్రజలకు సంతృప్తిని కలిగించేది. అనుమానం లేశమైనా కలిగించకపోయేది! ఇప్పుడు ఆ వాగ్దానాలను జ్ఞాపకం చేయబోతే ముగిసిపోయిన అధ్యాయమని అధికారికంగానే చెబుతున్నారు. ఇలా ముగిసిపోయిన అధ్యాయాలు పుస్తకం తెరవకుండానే కనబడుతున్నాయి. రాజకీయాన్ని రసవత్తరంగా నడపటం అంటే ఇదే. ఏ రాజకీయ పార్టీ కూడా ఈ ధోరణికి అతీతం కాదు! అన్ని పార్టీలూ ఈ విషయంలో ఏకగ్రీవంగానే ఉండడం విశేషం, బహు విచిత్రం!ఎన్నికలు సక్రమంగా జరిగితేనే ప్రజాస్వామ్యం నాలుగు కాలాలు నాలుగు కాళ్ళ మీద నిలబడుతుంది. 'నీతోటి నేను ఏకీభవించను. కానీ నీ అభిప్రాయాన్ని గౌరవిస్తాను' అనే ధోరణి ఇంతకుపూర్వం అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోగ్యకరంగా పరిఢవిల్లుతుండేది. 'శత్రుత్వాలు మనుషుల మధ్య కాదు, పార్టీల మధ్యనే' అన్న సూత్రం కూడా అప్పట్లో రాజకీయ నాయకులు, పాలక, ప్రతిపక్షాలు పాటిస్తుండేవి. చూడముచ్చటగా ఉండే ఆ రోజులు పోయాయి. మూర?ంగా, బాహాబాహీగా, రాజకీయ పోరాటాలు, ప్రజల బాగు కోసం కాకుండా, వ్యక్తుల బాగు కోసం, పార్టీల పేరిట ఈ దేశంలో జరుగుతున్నాయి. పెద్ద సమస్య పాలకవర్గం ఖాతాలో ఉద్భవిస్తే, చిన్న సమస్యగా రూపుదిద్దుకుంటున్నది. పాలకుల వల్ల ఏర్పడే చిన్న సమస్యను కూడా ప్రతిపక్షం భూతద్దంలో చూపించి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నది. అందుకే ఈ రాజకీయ పరిణామాలను ప్రజలు, ఓటర్లు పరిగణనలోకి తీసుకొని, స్వంత నిర్ణయాలు తీసుకునే ధోరణిలో పరిష్కరించుకోలేకపోతే అంబేడ్కర్ రాజ్యాంగం, భారతదేశ ప్రజాస్వామ్యం మాటలకే పరిమితం కాక తప్పదు. కొవిడ్ విపత్తు ఆర్థికంగా మనదేశాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఎన్నికల కోసం ప్రజల అవసరాలను తీర్చే వస్తువుల ధరల తగ్గుదల, ఎన్నికలు ముగియగానే ఆ ధరల పెరుగుదల నిత్యమూ చూడటానికి అలవాటు పడ్డాం. ఓటు అయిదేళ్ళకొకసారి ఉపయోగించే ఆయుధం. ఇలాంటి విషయాల్లో బహిర్గతపరిచే ఆందోళన ప్రజలు నిత్యమూ తలపెట్టినప్పుడే పాలకులు దిగిరాక తప్పదు. ఆ అవగాహనను మీడియా కొంతవరకే కల్పించడానికి




అవకాశం ఉంది. విద్యావంతుల సంఖ్య పెరిగిన ఈ తరుణంలో విద్యాధికులు, మేధావులు, సంఘజీవులుగా ఉండడం మానేసినట్లుంది. కేవలం బుద్ధిని నమ్ముకున్న పాతకాలం వారు ఇలాంటి విషయాల్లో 'ఫోకస్డ్'గా ఉండేవారు. ప్రస్తుతం ఆ ఫోకస్ ఈనాటి వారిలో మృగ్యమైంది. అందుకే ఎవరో ఒకరు తట్టి లేపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరి ఎవరు తట్టిలేపుతారో చూడాలి! కర్మభూమి అయిన మనదేశం అవసరం ఏర్పడినప్పుడు శక్తిగా మారి పరిష్కారం చూపించిన అనుభవాలు కోకొల్లలు. అందుకే ఆశగా ఉంది, ఆ శక్తి ప్రదర్శన క్రమేపీ జరుగుతుందని. ప్రజలకు ఆర్థిక తాయిలాలు తాత్కాలికం! ప్రజలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం శాశ్వతమార్గం. కొన్ని రాష్ట్రాల్లో, ముంబై లాంటి ప్రముఖ ప్రదేశాల్లో పరిపాలనా వ్యవస్థలు, ముఖ్యంగా పోలీసు వ్యవస్థలు చెడ్డ పేరు తెచ్చుకుంటున్నాయి. మన దేశ పోలీసు వ్యవస్థ అంతర్జాతీయంగా ముందు వరుసలో పనితీరుకు చిహ్నంగా భాసిల్లింది! ఆ పేరు పోగొట్టుకోదని ఆశపడటంలో తప్పు లేదు!అంతర్జాతీయంగా పొరుగు దేశాల వైఖరి మనదేశానికి అననుకూలంగా మారుతున్నదేమోనన్న అనుమానాలు ప్రబలుతున్నాయి. విదేశీ వ్యవహారాల్లో శత్రుదేశాలు, మిత్రదేశాలు పరిగణనలో ఉన్నా, ఒకప్పటి మిత్రదేశాలు శత్రుదేశాలుగా మారొచ్చు! అందుకే విదేశాంగ వ్యవహారాల్లో పరిణతి చెందిన రాజకీయ విజ్ఞత ప్రదర్శించక తప్పదు. ఆ వివేకం కొరవడుతున్న పరిస్థితులను చక్కదిద్దుకోవాలి.

పైన పేర్కొన్న అంశాల్లో పరిష్కార మార్గాలు తప్పక కనపడతాయని ఆశించటంలో తప్పు లేదు!

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయుష్ సంవాద్

**–ఆయుష్ డాక్టర్ ఆర్.శ్రీనివాన్**






బెల్లంకొండ: ఏప్రిల్ 15, ప్రజా పాలన ప్రతినిధి:మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు డాక్టర్ ఆర్ శ్రీనివాస్. ఆయుష్ వైద్య అధికారి చేత డాక్టర్ వినోద్ కుమార్ ఆయుష్ కమిషనర్ డాక్టర్ వెంకట్ రామ్ నాయక్ ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ రామకృష్ణ డి ఎ ఓ ఆదేశానుసారము సీజనల్ వ్యాధుల పైన మరియు కోవిడ్19 పైన మరియుకోవిడ్ టీకా పైన ,,ఆయుష్ సంవాద్, 'నాఆరోగ్యము నా బాధ్యత' అవగాహన మరియు వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోవిడ్ నిబంధనలు పాటించాలని. గౌరవనీయులైన మన ప్రధానమంత్రి చెప్పినట్లు గోల్డెన్ మిల్క్ అనగా 150%ఎశ్రీ% పాలలో ఒక అర చెంచా పసుపు కలిపి త్రాగవలని వెల్లుల్లి అల్లం ఆహారంతో పాటు ఎక్కువగా తీసుకోవలని అల్లం టీ తాగవలెను గోరువెచ్చని నీటిని తాగవలెను .60 సంవత్సరాల వయస్సు దాటిన వారందరూ కోవిడ్ టీకా తప్పకుం డా వేయించుకోవాలని. 45 సంవ త్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య ఉండి దీర్ఘకాల కాలంగా మధు మేహము. అధిక రక్తపోటు .గుండె సంబంధిత వ్యాధులు .క్యాన్సర్. ఊపిరితిత్తుల వ్యాధులు. కండర సంబంధిత వ్యాధులు. కాలేయ సంబంధిత వ్యాధులు. రక్త సంబంధిత వ్యాధులు. హెచ్ఐవి వ్యాధి ఉన్నవారు అందరూ తప్పకుండా కోవిడ్ టీకా అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నారని అని డాక్టర్. ఆర్ శ్రీనివాస్ తెలియపరిచారు. 270 విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుష్ మందులను వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి చావన ప్రాశ్ లేహాము . శంశనవటి. పంపిణీ చేయడం జరిగినది వేసవికాలంలో తీసుకోవాల్సన జాగ్రత్తల గురించి కాటన్ దుస్తులు వదులుగా ఉన్న వి ధరించ వలెను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరక్కుండా ఉండవలెను ఒకవేళ అర్జంట్ ఉంటే తలకు టోపీ రుమాలు టవల్ చున్నీ ధరించవలెను కొబ్బరి బొండం నీళ్ళు జావా గంజి బార్లీ నీళ్ల మరియు మంచినీళ్ల రోజుకు నాలుగు నుండి ఐదు లీటర్ల వరకు త్రాగలని కొంచెం నిమ్మకాయ రసంలో చిటికెడు ఉప్పు ఒక చెంచా చక్కెర కలుపుకుని తాగవలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బెల్లంకొండ మాజీ మండల ఉపాధ్యక్షులు అహ్మద్ భాషా బెల్లంకొండ మాజీ కో ఆప్షన్ నెంబర్ జాన్ పీరా (సిరిపురం మేస్త్రి ) పాల్గొని ఆయుష్ మందులను పంపిని చేశారు ప్రిన్సిపాల్ సరోజినీ దేవి, రమేష్ ,సాంబశివరావు ,ఏఎన్ఎంలు, ఆశ వర్కస్,రవికుమార్ లెక్చరర్లు పాల్గొన్నారు

# కొంపముంచిన ఆత్యాశ

అనంతపురం ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:అత్యాశ వారి కొంప ముంచింది. కాసుల కోసం కక్కుర్తి పడితే నిండా మునిగి పోయారు. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. ఇప్పుడున్న హైటెక్ యుగంలో కూడా అత్యాశ వల్ల లక్షలు పోగొట్టుకుంటున్నారు. కరువు సీమలో వైట్ కాలర్ నేరగాళ్లు ఎక్కువ అయ్యారు. పంటలు పండక నష్టాల్లో కూరుకు పోయిన రైతన్నలు లక్ష కడితే నెలకు 30 వేలు అదనంగా వస్తాయని చెబితే డబ్బులు కట్టి రైతన్నలు నిండా మునిగి పోయారు ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా వందల మంది రైతన్నలు సుమారు 300 కోట్లు పోగొట్టుకున్నారు. రైతన్నలు నిండా మునిగిపోయిన ఈ సంఘటన అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది.అనంతపురం జిల్లాలో ఈబిడ్ కంపెనీ పేరుతో నాగపూర్ చెందిన సునీల్ ఎండీగా సుధాకర్ నాయుడు మహేందర్ చౌదరి లతో కలిసి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 300 కోట్లు నిండా ముంచేశాడు అనంతపురం జిల్లాలో బ్రాంచిలు ఓపెన్ చేసి నెలకి లక్ష కి 40,000 అదనంగా ఇస్తానని నమ్మబలికి రైతుల వద్ద కోట్ల రూపాయలు వసూలు చేశారు.2018 నుంచి ఇప్పటివరకు సుమారు జిల్లావ్యాప్తంగా 300 కోట్లు వసూలు చేశారని బాధితుల వాపోయారు.అనంతపురం జిల్లా వ్యాప్తంగా నెల రోజుల నుంచి డబ్బు ఇచ్చిన రైతులు వారిని నమ్మి డబ్బులు ఇచ్చిన వారు ఏజెంట్ల ద్వారా రైతులు నిండా మునిగి పోయారు. .చేసేదేమీలేక నేడు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. జిల్లా ఎస్పీ కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు.వారితో కూలంకుషంగా కేసు విషయమై ఎస్పీ బంగ్లాలో విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు తీసుకున్నారు ఎండి సునీల్ జిల్లాకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులు మహేందర్ చౌదరి, సుధాకర్ నాయుడు లు వీరిపై కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు నష్టపోయిన రైతులను వారికి సంబంధించిన ఏరియాలో ఫిర్యాదు ఇవ్వాలని వెంటనే కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు జిల్లా వ్యాప్తంగా వైట్ కాలర్ నేరగాళ్ల ఎక్కువ అవుతున్నారని వారి భరతం పడతామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు..

# స్థానికులే వైసీపీకి ఓటు...

విజయవాడ, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:ఇటీవల ముగిసిన స్థానిక ఎన్నికలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో చిత్రమైన సంగతులు వెలుగు చూశాయి. విశాఖ, విజయవాడ వంటి కీలక నగరాల్లో కొన్ని చోట్ల టీడీపీ పుంజుకోవడం.. మరికొన్ని చోట్ల అందునా.. పట్టు బాగుందని భావించిన చోట్ల మాత్రం.. పార్టీ ఓడిపోవడం.. వంటివి చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై నిశితంగా దృష్టి పెడితే కొన్ని సంచలన విషయాలు వెలుగు చూడడం గమనార్హం. విజయవాడనే తీసుకుంటే.. ఇక్కడ కార్పొరేషన్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. అయితే.. ఇక్కడి మూడు నియోజకవర్గాల్లో ఓట్ల షేరింగ్‌ను గమనిస్తే.. ఆసక్తిగా ఉంది. తూర్పు నియోజకవర్గంలో టీడీపీ గత ఎన్నికల్లో విజయం దక్కించుకుంది. ఈ నియోజకవర్గంలో చంద్రబాబుకు అభిమాన గణంతోపాటు.. కమ్మ సామాజిక వర్గం హవా ఎక్కువగా ఉంది. పైగా ఇక్కడ నుంచి గెలిచిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా కమ్మ వర్గానికి చెందిన నాయకుడే కావడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ నుంచి గద్దె రామ్మోహన్ 18 వేల ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. ఇక్కడ ఓటు షేర్‌ను గమనిస్తే.. తూర్పులోని ఏడు డివిజన్లలో టీడీపీ గెలుపు గుర్రం ఎక్కింది. పైగా ఓటు బ్యాంకు కూడా ఎక్కువగా పడింది. దీనికి రీజనేంటి ? అంటే.. స్వతహాగా.. ఇక్కడే ఉన్న అంటే.. ఇక్కడే పుట్టి పెరిగిన కమ్మ సామాజిక వర్గం వైసీపీ వైపు మొగ్గు చూపగా.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి.. వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటోన్న, రియల్ రంగంలో ఉన్న కమ్మలు మాత్రం టీడీపీకి అనుకూలంగా ఓటేశారనే విషయం వెల్లడైంది.కోస్తాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన 'కమ్మ' వర్గ ఓటర్లుగా భావిస్తున్నారు. వైసీపీపై వ్యతిరేకత వీరిలో కొట్టొచ్చినట్టు కనిపించిందనే వ్యాఖ్యలు వస్తున్నాయి. జగన్ తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో వీరి వ్యాపారాలు భారీగా దెబ్బతిన్నాయి. రియల్ రంగం కుదేలైంది. దీంతో వీరు అధికార పార్టీకి వ్యతిరేకంగా మారినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఈ 'కమ్మ' సామాజికవర్గం ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలనే పట్టుదలతో వ్యవహరించిందని, వారు ఎక్కడా అధికార పార్టీకి లొంగకుండా పార్టీ గెలుపు కోసం సైలెంట్‌గా పనిచేశారని అంటున్నారు. ఇక, ఇక్కడే పుట్టి పెరిగిన కమ్మ వర్గం మాత్రం.. వైసీపీ వైపు మొగ్గు చూపారని తేలింది. దీంతో పలు డివిజన్లలో టీడీపీ గెలుపు గుర్రం ఎక్కిందని అంటున్నారు. సెటిల్ కమ్మ ఓటర్ల ప్రభావం ఎక్కువుగా ఉన్న పడమట, తూర్పు నియోజకవర్గంలో ఆ పార్టీ పలు డివిజన్లు గెలిచింది. ఇక టీడీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లలో కూడా ఎక్కువ మంది కమ్మ వర్గం వారే ఉన్నారు.

## బట్టా మోహనరావు సామాజిక సేవా దృక్పథం స్ఫూర్తి దాయకం

**– ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం..**

**– ట్రస్టు ద్వారా అందరికి చేయూతను అందించేందుకు కృషి**



చీరాల (ఒంగోలు), ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:రిటైర్డ్ అధ్యాపకునిగా, సామాజిక సేవా దృక్పథం కలిగిన మంచి పాత్రికేయునిగా, సమాజంలో మంచి పేరు సంపాదించుకున్న బట్టా మోహనరావు సామాజిక సేవా దృక్పథం స్ఫూర్తి దాయకం. తను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, తాను చదువు చెప్పిన విద్యాసంస్థల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించడమే కాకుండా, ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఆ ట్రస్టు ద్వారా అందరికి చేయూత ను అందించేందుకు ఆయన పడుతున్న తపన, చేస్తున్న కృషి మాటలలో చెప్పలేము. రిటైర్డ్ అయిన తర్వాత కూడా నవ యవ్వ నుడిలా హుషారుగా సామాజిక సేవలలో నిమగ్నమై ఉండటం ఆయనలోని మహోన్నతవ్యక్తిత్వానికి నిదర్శనం.ఆయన ఆశయాలను గౌరవిస్తూ, ఆయన సతీమణి, కుమారులు, కోడళ్ళు సైతం ట్రస్ట్ కు సహాయ సహకారాలు అందజేస్తూ బట్టా మోహనరావు చేపట్టే సామాజికసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటం నిజంగా ప్రశంసనీయం.ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా, బట్టమోహనరావు, పుష్పవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో,బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థినికి రూ.10వేలను, వేటపాలెం ఐసీడీఎస్ సీడీపీఓ కె.ఉమ చేతులమీదుగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన సజ్జా లీలా తేజస్విని బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, ఆమె చదువుకు అవసరమైన నగదును, ట్రస్ట్ ద్వారా ఆమె తల్లి అరుణకు అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉమ మాట్లాడుతూ, సాయం పొందిన విద్యార్థిని మంచిచదువులు చదివి, ఉన్నతస్థితికి చేరాలని ఆకాంక్షించారు. దాతలు ముందుకువచ్చి, ఆ విద్యార్థినికి సాయమందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బట్ట మోహనరావు, పుష్పవల్లి, ఆదిశంకరరావు పాల్గొన్నారు.

## మా జోలికి వస్తే తాట తీస్తాం: లోకేష్



రాజమండ్రి: జగన్ రెడ్డి జాంబిరెడ్డిలా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేత లోకేష్ విమర్శలు గుప్పించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలను జగన్ కరుస్తున్నారని, అందుకే వారు అలా ప్రవర్తిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గురువారం అనపర్తిలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి లోకేష్ హాజరై మాట్లాడుతూ "అనపర్తిలో అభివృద్ధి నిల్, అవినీతి ఫుల్. అనపర్తి వైసీపీ ఎమ్మెల్యే మంచి నటుడు, అవినీతిపరుడు. కాపవరంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో 400 కోట్ల రూపాయలు దోపిడి చేసేందుకు వైసీపీ ప్రయత్నిస్తే టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి అడ్డుకున్నారు. 2024లో టీడీపీ మళ్ళీ అదికారంలోకి వస్తుంది. జగన్ నాన్న, తాతలే టీడీపీని ఏమీ చేయలేకపోయారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వైసీపీ నేతల తాటతీయిస్తాం" అని లోకేష్ అన్నారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి దారుణ హత్య

**పాత కక్షల నేపథ్యంలో దారుణం**

**మృతుల్లో ఇద్దరు చిన్నారులు**

విశాఖపట్నం,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:విశాఖపట్నం జిల్లాలో దారుణం జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఓ అగంతకుడు ఒకరు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరుగురిని అత్యంత దారుణంగా హతమార్చాడు. చిన్న పిల్లలను సైతం విడిచిపెట్టకుండా అత్యంత పాశవికంగా పొట్టనబెట్టుకున్నాడు. విశాఖపట్నంలోని పెందుర్తి మండలం జుత్తాడలో జరిగిన ఈ దారుణ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. వివరాలు.. పాత కక్షల నేపథ్యంలో ఓ అగంతకుడు.. ఇంట్లో నిద్రిస్తున్న రమణ కుటుంబంపై దాడి చేసి చంపాడు. పదునైన ఆయుధంతో ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులందరినీ దారుణంగా హతమార్చాడు. మృతదేహాలన్నీ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రెండు మృతదేహాలు బాత్ రూములో పడివున్నాయి. మృతులు రమణ (63), ఉషారాణి (35), రమాదేవి (53), అరుణ(37) చిన్నారులు ఉదయ్ (2), ఉర్విష ( 6 నెలలు) గా గుర్తించారు.రెండు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షలే ఈ సంఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరుగురిని అప్పలరాజు అనే వ్యక్తే చంపి ఉంటాడని ప్రాథమిక నిర్థారణకు వచ్చారు. అనంతరం అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను సేకరిస్తున్నారు. ఆరుగురి హత్యతో జుత్తాడలో విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. విశాఖపట్నం సీపీ మనీష్ కుమార్ కూడా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు.

## జంతువులకు కరోనా రాకుండా వ్యాక్సిన్



ఒంగోలు, ఏప్రిల్ 15, : నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, ఇతర వన్యప్రాణులకు కరోనా వైరస్ సోకకుండా అటవీశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలానికి వెళ్లే ఘాట్‌రోడ్డు, నడకమార్గం, ఇష్టకామేశ్వరి గుడి, ఎకో టూరిజం మూసేశారు. ప్రస్తుతం వాహనాల రద్దీ పూర్తిగా లేకపోవడంతో వన్యప్రాణులన్నీ రోడ్లపైకి వస్తున్నాయి. నల్లమలలో సుమారు 48 పెద్ద పులులు, 60కి పైగా చిరుత పులులు ఉన్నాయి. వేల సంఖ్యలో జింకలు, దుప్పులు, వందల సంఖ్యలో ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటికి కరోనా వైరస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అటవీ సమీప గ్రామాలలోని ప్రజలకు సిబ్బంది ద్వారా కరపత్రాలు పంచి అవగాహన కలి?పస్తున్నారు. ఇష్టకామేశ్వరి, ఎకోటూరిజం ప్రాంతాలను మూసివేయడంతో భక్తులు, సందర్శకుల రాక నిలిచిపోయింది. వేసవి కాలం కావడంతో నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 24 బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేసి 120 మంది టైగర్ ట్రాకర్‌లను నియమించి పులుల కదలికపై నిఘాపెట్టారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బందిని ఎక్కువగా నియమించి ఎవ్వరినీ అటవీ ప్రాంతంలోకి పంపకుండా చర్యలు తీసుకున్నారు.వివిధ ప్రాంతాల్లో జంతువులకు నీటిని అందించేందుకు సాసర్‌పిట్‌లను ఏర్పాటు చేసి ట్యాంకర్‌ల ద్వారా నీటిని నింపుతూ జంతువులకు నీటి సమస్య లేకుండా చేస్తున్నారు. పట్టణాల్లో ఉన్న కోతులను ఇటీవల అటవీ ప్రాంతానికి తరలించారు. వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటూ పండ్లను అందిస్తున్నారు. చిన్న మంతనాల, చింతల, పెద్ద మంతనాల ప్రాంతాల్లో కోతుల కోసం స్టాల్‌ఫీట్స్‌ను ఏర్పాటు చేశారు.

## తెలుగుదేశం నాయకులు, అభిమానుల మధ్య డా.చదలవాడ అరవింద బాబు జన్మదిన వేడుకలు







నరసరావుపేట,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్–ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు జన్మదిన వేడుకలు గురువారం నరసరావుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. చదలవాడ అరవింద బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేకులు డా.చదలవాడ అరవింద బాబు కట్ చేసి నాయకులకు,కార్యకర్తలకు,అభిమానులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని డా.చదలవాడ అరవింద బాబు కు శుభాకాంక్షలు తెలిపారు. డా.అరవింద బాబు జన్మదిన సందర్భంగా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్ నరసరావుపేట, రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు,వెన్న బాలకోటి రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు బోడపాటి పేరయ్య,మెట్టు వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొట్ట కిరణ్,ఇమిడిశెట్టి కాశయ్య, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయం శ్రీ,పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కూరపాటి హనుమంతరావు, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, సంగం డైరీ మాజీ డైరెక్టర్ మక్కెన ఆంజనేయులు, పెద్ద రెడ్డిపాలెం సర్పంచ్ ఇండ్లమురి రామారావు, మాజీ కౌన్సిలర్లు రావెళ్ల లక్ష్మీనారాయణ, పోక శీను, చంద్రశేఖర్,సంజీవరావు, గడ్డం కరిముల్లా,పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు శేఖర్, మండల తెలుగు యువత అధ్యక్షులు యాంపరాల ఖాసిం, లీగల్ సెల్ లాయర్లు చెన్నుపాటి నాగేశ్వరరావు, సీతారామాంజనేయులు,చక్రపాణి మాజీ ఎంపీటీసీ కనుమూరి రమేష్,చవపాటి సైదవాలి, శాఖమూరి రామమూర్తి, దాసరి నరసింహారావు,సైదావలి కడియాల తాండవ కృష్ణ,రాయల్ శ్రీను,బడే బాబు, వారంతి, నగూర్, తిరుమలశెట్టి ఏడుకొండలు,లుక్స్ సుబ్బు,చల్ల సుబ్బారావు,వాసిరెడ్డి రవి,మానుకొండ జాహ్నవి, గంగినేని లీలావతి,కనుమూరి లక్ష్మి, పాలడుగు కుమారి, బిందు ప్రియా, సైదమ్మ పాల్గొన్నారు. తొలత 60 అడుగుల రోడ్డు లోని మైనార్టీ నేతలు బడే బాబు,భాష,నగూర్ ఏర్పాటు చేసిన లిటిల్ హార్ట్స్ అనాధ శరణాలయంలో సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య చేత పుట్టినరోజు కేక్ కట్ చేసి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.తదుపరి అడ్వకేట్, ఎస్సీ నాయకులు మానుకొండ జాహ్నవి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో పేదలకు బట్టలు పంపిణీ నిర్వహించారు.ఈ సందర్భంగా డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఆత్మీయులకు,పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి, లోకేష్ బాబు కి, అచ్చెన్నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కి, నాయకులకు,కార్యకర్తలకు ఎప్పుడు ఎల్లవేళల అండగా ఉండి పార్టీ అభివృద్ధికి పాటుపడతానని ఎటువంటి కష్టం వచ్చిన ప్రజలకు అండగా ఉంటానని దీనిలో ఎటువంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు.

# దువ్వాడ ఆజన్మ వైరం



శ్రీకాకుళం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:శ్రీకాకుళం జిల్లాలో కొందరి నేతల రాజకీయాలు ఇలాగే ఉంటాయి. అక్కడ కొందరు మాస్కులు వేసుకుని అధికారంలో ఉన్న పార్టీతో దోస్తీ చేస్తుంటారు. అవతల వారు మళ్ళీ అధికారంలోకి వస్తే వీరికి సాయం చేస్తూ ఆ బాకీ తీర్చేస్తారు. ఇలా సాగిపోతున్న రాజకీయాల్లో దూకుడు, ముక్కుసూటితనమే తప్ప మరేమీ తెలియని దువ్వాడ శ్రీనివాస్ ప్రవేశించారు. ఆయన మొదట కాంగ్రెస్ లో ఉండేవారు. మైనింగ్ వ్యాపారంలో బాగానే ఆర్జిస్తూ బంగారంలా ఉండే దువ్వాడ కాంగ్రెస్ లో చేరాక కానీ అసలు సంగతి తెలియలేదు.అటు సొంత కాంగ్రెస్ పార్టీ, ఇటు విపక్ష తెలుగుదేశం నాయకులు అందరూ కలసి టార్గెట్ చేసి దువ్వాడ శ్రీనివాస్ ను ఇబ్బందుల పాలు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ అవుతాడనుకున్న దువ్వాడ కేవలం వైఎస్ చైర్మన్ తోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. మరో వైపు చూస్తే 2009 ఎన్నికల నాటికి ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినా, 2014, 2019ల్లో వైసీపీ నుంచి బరిలో దిగినా గెలుపు మాత్రం ఆయన పిలుపు వినలేదు. మొత్తానికి ఇన్నాళ్ళకు ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. ఇది తనకు జగన్ ఇచ్చిన వరం అంటున్నారు.తాను జగన్ని నమ్మానని, జగన్ కూడా మాట మీద నిలబడి తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చట్ట సభల్లో అడుగుపెట్టేలా చేశారని దువ్వాడ శ్రీనివాస్ అంటున్నారు.

తాను ఇంతకంటే మరేమీ కోరుకోనని కూడా ఆయన చెబుతున్నారు. ఇపుడు తన మీద ఎంతో బాధ్యత ఉందని కూడా అంటున్నారు టెక్కలిలో అచ్చెన్నాయుడుని ఓడించడమే తన టార్గెట్ అని కూడా ఎలాంటి జంకూ గొంకూ లేకుండా దువ్వాడ శ్రీనివాస్ చెప్పేశారు. తాను టెక్కలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఆ మీదటనే 2024లో వచ్చే ప్రభుత్వంలో మంత్రిని అవుతాను అని ఆయన ధీమాగానే చెబుతున్నారు. టెక్కలితో పాటు శ్రీకాకుళం జిల్లాలోని పది అసెంబ్లీ సీట్లను కూడా గెలిపించి జగన్ కి గిఫ్ట్ ఇస్తామని కూడా అయన అంటున్నారు.దువ్వాడ శ్రీనివాస్ విషయం తీసుకుంటే ఆయన తనను రాజకీయంగా అణగదొక్కి తన వ్యాపారాలను విధ్వంసం చేసిన వారి మీద కసితో ఉన్నారని అర్ధమవుతోంది. అలాగే తనను జైలు పాలు చేసిన వారి మీద కూడా ఆయన కత్తి కట్టారు రాజకీయంగానే ఇవన్నీ ఎదుర్కొంటానని అంటున్నారు. అంతే కాదు శ్రీకాకుళం జిల్లాలో అచ్చెన్నాయుడిని ఓడించి రాజకీయంగా ఆయన హవాకు ఫుల్ స్టాప్ పెడతామని కూడా చెబుతున్నారు. జగన్ కోరింది కూడా ఇదే. తనలాగే దేనికైనా తట్టుకునే దువ్వాడ శ్రీనివాస్ ను అందుకే ఆయన రెడీ చేసి మరీ అచ్చెన్నకు పోటీగా దింపారు. ఇపుడు దువ్వాడ శ్రీనివాస్ ఆ బాధ్యతను నూటికి నూరు శాతం నెరవేరుస్తాను అంటున్నారు. సో వైసీపీకి జగన్ కి ఇంకేం కావాలి



## తమ్మినేని ఒత్తిళ్లతోనే నాపై కేసులు: కూన రవికుమార్

శ్రీకాకుళం జిల్లా: పోలీసులు తనపై అక్రమ కేసులు బనాయించారని తెలుగుదేశం పార్టీ నేత కూన రవికుమార్ అన్నారు. తాను తప్పు చేసినట్టు పోలీసుల దగ్గర ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అక్రమ కేసులు బనాయిస్తున్న పోలీసులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ఒత్తిళ్లతోనే తనపై కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడనన్నారు. తమ్మినేనికి ఆమదాలవలస నడిరోడ్డుపై గుడ్డలూడదీస్తానని కూన రవికుమార్ హెచ్చరించారు.కాగా కూన రవికుమార్‌కు బెయిల్ మంజూరయింది. రాజాం సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం కూన రవికి బెయిల్ మంజూరు చేసింది. పెనుబర్తిలో ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా జరిగిన కొట్లాటలో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. వారం రోజులుగా అజ్ఞాతంలో ఉన్న ఆయన గురువారం ఉదయం పొందూరు పోలీస్ స్టేషన్‌లో సరెండర్ అయ్యారు.

# పది రోజులు కొకసారే నీళ్లు

అనంతపురం, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:అనంతపురం జిల్లాలో రోజురోజుకు నీటికష్టాలు పెరిగిపోతున్నాయి. పదిరోజులకు ఒకసారి నీళ్లు వస్తుండడంతో ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. ప్రభుత్వం టాంకర్ల ద్వారా ఉప్పు నీటిని సరఫరా చేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అటు తాగడానికి పనికిరాని నీటిని సరఫరా చేస్తున్న అధికారుల తీరుపై మండిపడుతున్నారు.అనంతపురం మీదుగా నేషనల్ హైవే 44 వెళుతుండడంతో.. ఈ పరిసర ప్రాంతాల్లో, కొందరు అక్రమ నివాసాలేర్పరుచుకున్నారు . పేరుకేమో అనంతపురం శివారు ప్రాంతమే అయినప్పటికీ, ఈ కాలనీలు మాత్రం అటు నగర కార్పొరేషన్ పరిధిలోకి రావు. మరోవైపున, గ్రామపంచాయితీలు కూడా వీరిని నిర్లక్ష్యం చేస్తున్నాయి. . శివారు ప్రాంత పేద ప్రజలు తాగునీటికోసం అలమటిస్తున్నారు. కూలి పనులు కావాలంటే నీటిని, నీళ్ళుకావాలంటే పనులను వదులుకోవాల్సిన దుస్థితి. నగరానికి నీటిని సరఫరా చేసే పైపులైనుకు గండికొట్టి, తమ గ్రామపంచాయితీలకు నీటిని మళ్ళించుకున్న నగరశివారు ప్రాంత ప్రజలు, భవిష్యత్తులో జరగబోయే జలయుద్ధాలకు శంఖమూదుతున్నారు. పగ్రామీణ ప్రాంతాల నుండీ వచ్చిన వీరందరూ దినకూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

వీరి సమస్యలకు తోడుగా,వేసవిలో తాగునీటి సమస్యకూడా అదనంగా వచ్చిచేరింది. పావంపేట పంచాయితీ, వడ్డేకాలనీ, విద్యారణ్యనగర్ లతో పాటుగా మరికొన్ని ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది.తమ సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా.. పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అనంతపురం నగరానికి నీరుసరఫరా చేసే పైపులైనుకు గండికొట్టి, తమపంచాయితీలకు నీటిని మళ్ళించారు కొందరు. పైపులైనుకు గండికొట్టడంతో,నగరంలోని పాతఊరు,ఇతర 8డివిజన్లలో నీటికొరత మొదలైంది. తాగడానికి నీళ్ళు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.అనంతపురంలోని పాతఊరు,రాణినగర్,ఇతరప్రాంతాల్లో తీవ్రతాగునీటి ఎద్దడి వుంది. నిర్దేశించిన సమయం కంటే,మూడు నెలలకు ముందే హెచ్చెల్సీ కెనాల్ కు నీరు విడుదలచేయడం ఆపేశారు. దీంతో,స్టోరేజ్ కెపాసిటీ తగ్గింది. .పాతఊరిలో పూలవ్యాపారులు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. ఈ ఎండలకు తమ పూలు వాడిపోతే, వ్యాపారం దెబ్బతింటుంది. తమ వ్యాపారం కోసం, రోజుకు 150 రూపాయలు ఖర్చుపెట్టికొన్న మినరల్ వాటర్ తో పూలను తడుపుతున్నామంటున్నారు.తాగు నీటి కోసం ఉప్పు నీటిని పంపుతున్నఅధికారుల తీరుపైనా... మండిపడుతున్న స్థానికులు ఉన్న నీటిని పట్టుకునేందుకు సిగపట్లు పడుతున్నారు. నీళ్లు తాగాలంటే.. పని మానేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# మోడీ టార్గెట్ గా టీడీపీ...!





తిరుపతి, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:తిరుపతి ఎన్నికల్లో చావో రేవో తేల్చుకోవాలని నిర్ణయించుకున్న టీడీపీ.. ఆదిశగా అనేక వ్యూహాలు అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే సెంటిమెంటును రెచ్చగొట్టే కార్యక్రమానికి టీడీపీ నాయకులు తెరదీసినట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా.. ప్రత్యేక హోదా ఇవ్వని మోడీని టార్గెట్ చేసుకుని.. ఓట్లు చీలిపోయి.. బీజేపీ బలపడకుండా చూస్తోందనే టాక్ వినిపిస్తోంది. అయితే.. ఈ క్రమంలో టీడీపీ చేస్తున్న విమర్శల్లో 'పస' ఎంత? అనేది చర్చనీయాంశంగా మారింది. గత 2019 ఎన్నికలకు ముందు కూడా ఇలానే మోడీపై విమర్శలు సంధించారు.. టీడీపీ సీనియర్లు. అప్పటి ప్రభుత్వ సలహాదారు.. కుటుంబ రావు ఎన్నికలకు ముందు మీడియా సమావేశం పెట్టి మరీ ఓ బాంబు పేల్చారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ పెద్ద కుంభకోణం చేశారని ఆరోపించారు. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పత్రికల్లో ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. అయితే.. ఇంతా చేస్తే.. అది రఫేల్ యుద్ధ విమానాల కుంభకోణానికి సంబంధించిన అంశం. దీనిపై అప్పట్లోనే సుప్రీం కోర్టులో పిటిషన్లు పడ్డాయి. అనిల్ అంబానీ సంస్థకు మేలు చేసేలా ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన ఈ యుద్ధ విమానాల కాంట్రాక్టును అప్పగించారని తెలిపారు. అయితే.. సుప్రీం కోర్టు వీటిని గుండుగుత్తగా కొట్టేయడం.. మోడీ పాత్ర లేదని పేర్కొనడం కొసమెరుపు. అంటే.. అప్పట్లో మోడీపై చేసిన దాడిని రాజకీయ కోణంలోనే చూడాల్సి వచ్చింది. మోడీని బద్నాం చేయడం ద్వారా.. ఒక్కసారిగా ఎన్నికల వేళ ఒక హైప్ సృష్టించాలని టీడీపీ ప్రయత్నించింది.ఇక, ఇప్పుడు కూడా ఇదే తరహాలో టీడీపీ నాయకులు మోడీని టార్గెట్ చేసుకున్నారు. ఈ క్రమంలో వారు ఎంచుకున్న సబ్జెక్టు.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం. ఈ పథకం కింద పేదలకు రూ.2.6 లక్షల రూపాయలతో దీనిలో (రాష్ట్ర సర్కారు వాటా కూడా ఉంటుంది) భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని.. దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. అంటే.. గృహ నిర్మాణం కింద పేదలకు ఇస్తున్న రెండున్నర లక్షల రూపాయల్లో కుంభకోణం పేరుతో మోడీ ప్రజాధనాన్ని దోచేశారన్నది టీడీపీ విమర్శ. అయితే.. ఇక్కడ చిత్రంగా అదే ప్రధాని చేతుల్లో ఉండే సీబీఐతో విచారణ కోరుకోవడం గమనార్హం. సీబీఐ అంటేనే ప్రధాని చెప్పినట్టునడుస్తుందనే వ్యాఖ్య ఉంది.మరి ఇప్పుడు ప్రధాని కుంభకోణం చేశారని ఆరోపిస్తున్న టీడీపీ సీబీఐ విచారణకు కోరుకోవడం విచిత్రంగా ఉంది. పైగా ఈ విషయాన్ని తాము తవ్వి తీశామని.. దీనిని మీడియా హైలెట్ చేయడంలో విఫలమైందని.. మీడియా కూడా మోడీకి అమ్ముడు పోయిందని వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ మొత్తం అంశాలను గమనిస్తే.. ఇది కేవలం ఎన్నికలకు ముందు టీడీపీ చేస్తున్న వ్యూహం తప్ప మరొకటి లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. మరి ఇలాంటి వ్యూహాలు ఏమేరకు ఎన్నికల్లో ఫలితాన్ని ఇస్తాయనేది ప్రశ్నార్థకం. ఏదైనా ఉంటే.. విధాన పరంగా విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకోవడం తప్పుకాదు కానీ.. ఇలా ఏమీలేని విషయాలను వెలుగులోకి తీసుకువచ్చి విమర్శలు గుప్పించడం ఎందుకు ? అనేది అంతుచిక్కని ప్రశ్న.

# జనసేనతో పొత్తుపై మీ మాంస..!

విజయవాడ, ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ ఉనికికోసం పాట్లు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019 ఎన్నికల సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న పార్టీని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు ప్రయాసపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని అనుకున్నారు. అయితే.. అది సాధ్యం కాలేదు. ఈ క్రమంలోనే సరికొత్త ఫార్ములా ఒకటి తెరమీదికి వచ్చింది. బీజేపీతో జట్టుకట్టి.. రంగంలోకి దిగిన జనసేనకు బీజేపీ వల్ల ఎలాంటి ఫలితం దక్కలేదు. అయితే.. జనసేన ఒంటరిగా బరిలో నిలిచిన చోట గెలుపు గుర్రం ఎక్కినా ఎక్కకపోయినా.. ఓట్లు మాత్రం బాగానే రాబట్టింది. టీడీపీ ఒంటరిగా పోటీ చేసిన చోట ఆ పార్టీ కూడా బాగానే ఓట్లు సాధించింది అంటే.. ప్రభుత్వ ఓట్లు.. ఇక్కడ చీలిపోయాయనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఇక, ఈ క్రమంలోనే టీడీపీ సీనియర్లు.. ఒక సరికొత్త వాదనను తెరమీదికి తెస్తున్నారు. జనసేనతో కలిసి ముందుకు సాగితే.. టీడీపీ ఉనికి నిలబడుతుందనేది వారి వాదన. అదే సమయంలో జనసేనకు కీలకమైన నియోజక వర్గాలు వదిలి పెట్టాలని కూడా వీరు సూచిస్తుండడం గమనార్హం. అలా అయితేనే జనసేన కూడా పార్టీతో మనస్ఫూర్తిగా కలిసి వస్తుందని టీడీపీలో కొందరు కాపు నేతలు, సీనియర్లు చంద్రబాబుకు సూచించినట్టు తెలిసింది.అయితే ఈ పరిణామంతో పార్టీ దెబ్బతింటుందనే జంకు కూడా కొందరిలో కనిపిస్తోంది. దీనిపై జనసేనకు చెందిన కొందరు నేతలతో టీడీపీ నేతలు ప్రాథమికంగా చర్చిస్తున్నారు కూడా..! వచ్చే ఎన్నికల్లో వైసీపీని అధికారం నుంచి గద్దె దింపాలంటే ఖచ్చితంగా మన రెండు పార్టీలు పొత్తులతోనే ముందుకు సాగాలని విజయవాడకు చెందిన జనసేన కీలక నేత టీడీపీ ముఖ్య నేతలతో జరిగిన చర్చల్లో అన్నారు. ఈ క్రమంలోనే ఆయన విజయవాడలో తూర్పు సీటు తమకు ఇస్తే బాగుంటుందని కూడా చెప్పారట. అయితే ఇది జరిగేపని కాదు? విజయవాడ తూర్పు నియోజకవర్గంలో టీడీపీకి బలం ఉంది. కానీ.. ఇప్పుడు ఇలాంటి చోట జనసేన పోటీ చేయాలని కోరుతోంది.అక్కడ టీడీపీకి సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉన్నారు. రేపు కనుక టీడీపీ.. జనసేనతో పొత్తు పెట్టుకుంటే.. ఇలాంటి సీట్లను జనసేనకు వదిలేయాలి. టీడీపీకి బలమున్న సీట్లనే రెండు పార్టీలో కోరితే ఆ పొత్తు ఎంత వరకు కలిసొస్తుందో ? చెప్పలేం. జనసేన ఎక్కడ కోరుకుంటే.. అక్కడ టికెట్లు కేటాయించాలి. కనీసం 30-50 స్థానాల్లో జనసేన కోరితే.. ఖచ్చితంగా ఇవ్వగలగాలి. అవికూడా టీడీపీకి పట్టున్న చోట కోరినా కాదనే పరిస్థితి ఉండదు.నేపథ్యంలో ఇప్పుడు ఇలాంటి ఫార్ములా అవలంబిస్తే.. టీడీపీకి ఆయువు పట్టు వంటి నియోజకవర్గాల్లో జనసేన బలపడడం ఖాయంగా కనిపిస్తుండగా.. టీడీపీ మాత్రం పోరాటం చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అప్పుడు మరి కొంత మంది పార్టీ నేతలు కూడా పార్టీని వీడే అవకాశం ఉంది. ఇది పార్టీకి ఎలా మేలు చేస్తుందో పార్టీ మేధావులు సెలవివ్వాల్సిన అవసరం ఉంది. కానీ, వారు మాత్రం టీడీపీ నెగ్గాలంటే.. ఖచ్చితంగా జనసేనతో ముందుకు సాగి.. దానిని మచ్చిక చేసుకోవాలనే ప్రతిపాదనను తెరమీదికి తెస్తున్నారు. మరి దీనిని చంద్రబాబు పాటిస్తారో లేదో చూడాలి

# ఏడాదిలో 50 కు పైగా పెరిగిన స్లమ్స్

విశాఖపట్టణం,ఏప్రిల్ 15, ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ జెట్ వేగంతో దూసుకుపోతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కూడా స్మార్ట్ సిటీ జాబితాలో విశాఖను చేర్చారు. వేలాది కోట్లతో నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని పాలకులు ప్రకటించారు.అయితే.. పాలకులు ఊదరగొట్టిన అభివృద్ధి ఏదీ నగరంలో కనిపించడం లేదు. స్లమ్స్ లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. 632 వందల చదరపు కిలోమీటర్ల ఉన్న విశాఖ నగరంలో కేవలం 0.6 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని మాత్రమే స్మార్ట్ సిటీగా ప్రకటించారు. మరో వైపు సీటి విస్తీర్ణం పెరగడంతో... అదే లెవల్ లో స్లమ్స్ పెరుగుతున్నాయి.మురికివాడల సంఖ్యను తగ్గించేందుకు వందల కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం చెప్పుతున్నప్పటికీ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ తాజాగా చేపట్టిన సర్వేలో 2013లో నగరంలో 741 ఉన్న స్లమ్స్ ఉండగా.. అవి 790కి పెరిగాయని ప్రకటించింది. అదేవిధంగా మురికివాడల్లో ఉండే జనాభా సంఖ్య 352 శాతం



పెరిగింది. ఇది ఇలాగే కొనసాగితే విశాఖ నగరం ముంబయి తరహాలో మురికివాడల నగరంగా మారే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.ఇక మురికివాడల నిర్మూలనకు జీవీఎంసీ బడ్జెట్‌లో 40 శాతం నిధులు కేటాయించాలని నిబంధన ఉన్నప్పటికీ పాలకులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో క్రమక్రమంగా స్లమ్స్ పెరిగిపోతున్నాయి. అయితే.. నగరంలో మురికివాడలను నిర్మూలించకుండా స్మార్ట్‌సిటీ ఎలా చేస్తారని స్వచ్ఛందసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్ సిటీ పేరుతో పేదలను స్లమ్స్ నుంచి ఖాళీ చేయించి విలువైన భూములు కొట్టేయ్యడానికి ప్రయత్నిస్తుందని విమర్శిస్తున్నారు. ఇదిలావుంటే.. అధికారుల వాదన మరోలా ఉంది. 2022లోగా మురికివాడలన్నీ నిర్మూలించి పేదలకు ఇళ్లు కట్టిస్తామంటున్నారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా చేస్తామంటూ గొప్పలు చెబుతున్న పాలకులు.. మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# రగులుతున్న మయన్మార్ - పర్యవసానాలు







ఈ ఏడాది ఫిబ్రవరిలో సైనిక తిరుగుబాటు జరిగినప్పటి నుంచి ఆ దేశం మంటల్లో రగులుతోంది. మిలిటరీ తిరుగుబాటు, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం రద్దు, ఆంగ్ సాన్ సూకీ, ఆమె పార్టీ సహచరుల అరెస్టుకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ నిరసనలను అణచివేసేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో 700 మంది దాకా మరణించారు. మూడు వేల మందికి పైగా అరెస్టయ్యారు. ఇంకా అనేక మంది జాడ తెలియరాలేదు. మయన్మార్‌లో సైనిక తిరుగుబాట్లు కొత్తేమీ కాదు. సైనిక తిరుగుబాట్లు నిత్యకృత్యంగా మారిన మన పొరుగు దేశమైన మయన్మార్ చాలా కాలం పాటు (1988-2011) సైనిక పాలన కింద మగ్గింది. ప్రజాస్వామ్యం, ప్రజా ప్రభుత్వ సాధనకై ఎంతో కాలంగా సాగించిన పోరాట ఫలితంగా మిలిటరీ ప్రభుత్వం దిగొచ్చి స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేందుకు, ఎన్నికల అనంతరం ఏర్పడే ప్రభుత్వానికి తన అధికారాల్లో కొన్నిటిని అప్పగించేందుకు ఒప్పుకుంది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న నిరసనలు, అంతర్జాతీయ సమాజం నుంచి మిలిటరీ పాలకులపై పెరిగిన ఒత్తిడి ఫలితంగా 15 ఏళ్లుగా జైలులో ఉన్న ఆంగ్ సాన్ సూకీని మిలిటరీ ప్రభుత్వం విడుదలజేసింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో సూకీ నేతృత్వంలోని ఎన్ఎల్‌డి పార్టీ మెజార్టీ సీట్లు గెలుచుకుంది. అయినా సూకీ ప్రభుత్వాధినేత కావడానికి సైన్యం అనుమతించలేదు. మిలిటరీ ఆమోదించిన రాజ్యాంగం విదేశీయుణ్ణి వివాహమాడినవారు ఎవరైనా సరే ప్రభుత్వంలో ఉన్నత పదవులను అధిష్టించడానికి వీల్లేకుండా నిషేధం విధించింది. దీంతో ఆమె ప్రభుత్వ కౌన్సిలర్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వంపైన, ప్రభుత్వ విధానాలపైన అపరిమితమైన ప్రభావం చూపగలిగే స్థితి ఆమెకు ఉన్నదనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అందుకే ఆమె (నోబెల్ శాంతి బహుమతి గ్రహీత) కనుసన్నల్లో రోహింగ్యాలపై సాగిన ఊచకోతను యావత్ ప్రపంచం ఖండించింది.గత ఏడాది జరిగిన ఎన్నికల్లో సూకీ పార్టీకి ఎదురుదెబ్బలు తప్పవని చాలా మంది భావించారు. కానీ, వారి అంచనాలను తలకిందులు చేస్తూ ఎన్ఎల్‌డి పార్లమెంటులో తన బలాన్ని పెంచుకోగలిగింది. ఆ పార్టీకి మద్దతు ఇచ్చిన సైన్యానికి సైతం ఈ ఫలితాలు ఆశ్చర్యం కలిగించాయి. ఎన్నికల ఫలితాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శలొచ్చాయి. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల కమిషన్ వీటిని తోసిపుచ్చింది. అప్పటి నుంచి సైన్యానికి, ఎన్నికైన ప్రభుత్వానికి మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. రెండోసారి ఎన్నికైన ప్రభుత్వం అధికారం చేపట్టేందుకు సైన్యం అనుమతించదన్న పుకార్లు వ్యాపించాయి. చివరికి ఆ పుకార్లే నిజమని సైన్యం నిరూపించింది. మిలిటరీ తిరుగుబాటు తరువాత అధికార పగ్గాలు ఒక ఏడాది పాటు తాను చేపట్టనున్నట్లు సైన్యం ప్రకటించింది. ఆ వెంటనే మిలిటరీ కమాండర్ చీఫ్ జనరల్ మిన్ హిలియాంగ్ అధికారం చేపట్టారు. గత ఏడాది పార్లమెంటు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ పలువురు సీనియర్ నేతలను సైన్యం నిర్బంధించింది. అవినీతికి పాల్పడ్డారంటూ సూకీ పైనా పలు కేసులు పెట్టింది. సూకీకి తన రాజకీయ మిత్రపక్షం నుంచి 6 లక్షల నగదు, బంగారు కడ్డీలు ముట్టాయన్న అభియోగాలను మోపింది. ఇటీవల ఓ చీకటి వ్యాపారి ప్రభుత్వ టి.వి లో మాట్లాడుతూ తన వ్యాపారంలో సహకరించేందుకు ప్రభుత్వం లోని మంత్రులకు 2018-2020 మధ్య ఎంతెంత మొత్తం ఇచ్చినదీ వెల్లడించారు. ఇందులో సూకీ పేరును కూడా ప్రస్తావించారు. 2018లో సూకీ తన తల్లి పేరిట ఏర్పాటు చేసిన చారిటబుల్ ఫౌండేషన్‌కు లక్ష డాలర్లు ఇచ్చానన్నారు. 2019లో లక్షా యాభై వేల డాలర్లు, 2020 ఫిబ్రవరిలో 50 వేల డాలర్లు, 2020 ఏప్రిల్‌లో రెండు లక్షల యాభై వేల డాలర్లు ఇచ్చినట్లు తెలిపారు. అయితే, ఎందుకిచ్చినదీ నిర్దిష్టంగా తెలపలేదు. ఈ ఆరోపణలపై దేశంలోని అవినీతి నిరోధక కమిషన్ దర్యాప్తు చేపట్టింది. అవినీతి నిరోధక చట్టం కింద సూకీపై చర్య తీసుకుంటామని చెప్పింది. ఆమె పైన, పదవీచ్యుతుడైన అధ్యక్షుడు విన్ మియంట్ పైన అశాంతిని రెచ్చగొట్టారని, వాకీటాకీలను అక్రమంగా కొనుగోలు చేశారని, కరోనా నిబంధనలను అతిక్రమించి సభలకు జనాన్ని సమీకరించారన్న అభియోగాలను ఆర్మీ మోపింది.సూకీ ప్రభుత్వం పట్ల ప్రజలు ఏమంత సంతోషంగా లేరన్న మాట నిజం. ఉద్యోగాల కల్పన హామీలు నెరవేర్చడంలో ఆమె విఫలమయ్యారు. ప్రభుత్వంలో కింది నుంచి పై దాకా అవినీతి పెరిగిపోయింది. దేశ స్థూల ఆర్థిక పరిస్థితి కూడా దిగజారింది. అన్నిటికన్నా ముఖ్యంగా కరోనాను ఎదుర్కోవడంలో విఫలమైంది. ప్రజాస్వామ్యానికి చిహ్నంగా నిలుస్తారని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. అసమర్థులు, వివాదాస్పదులైన వ్యక్తులు ఆమె చుట్టూ చేరడం, వారిపైనే ఆమె ఎక్కువగా ఆధారపడడం, ప్రజాస్వామ్యం గురించి మాటలే తప్ప చేతలు లేకపోవడం, ఆమె ప్రభుత్వం (డిఫ్యాక్టో ఎన్ఎల్‌డి ప్రభుత్వం) అనేక క్రూరమైన చట్టాలు తీసుకొచ్చి, చాలా మందిని జైలులో పెట్టడం, విమర్శలను సహించలేకపోవడం ఇవన్నీ చూశాక సూకీ అంటే నియంత అన్న భావన ఏర్పడింది. ఆమెలో ఉన్న ఈ లోపాలను సొమ్ము చేసుకోవచ్చని భావించిన సైన్యం ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సూకీని, ఆమె సహచరులను అరెస్టు చేసింది. అయితే ఆ తరువాత జరిగిన పరిణామాలు ఈ విషయంలో ఆర్మీ అంచనా తప్పు అని రుజువు చేశాయి. తిరుగుబాటు తరువాత నిరసనలు తలెత్తుతాయని సైన్యం కరెక్టుగానే అంచనా వేసింది. అయితే ఆ నిరసనలు ఈ మోతాదులో ఉంటాయని ఊహించలేకపోయింది. ప్రజలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. అలా అని మిలిటరీ పాలనను సమర్థించేందుకు, ఎంతో కష్టపడి సాధించిన హక్కులను వదులుకునేందుకు సిద్ధంగా లేరు. మిలిటరీ తిరుగుబాటుకు వ్యతిరేకంగా యువత పెద్దయెత్తున వీధుల్లోకి వస్తోంది. వారికి దన్నుగా కార్మిక సంఘాలు నిలిచాయి. ఈ ప్రతిఘటన అంతకంతకూ ఊపందుకుంటోంది. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మధ్యతరగతి ఉద్యోగులు, డాక్టర్లు, నర్సులు (ఆరోగ్య కార్యకర్తలు- మొత్తం ప్రభుత్వ ఉద్యోగుల్లో 10శాతం దాకా వీరే ఉన్నారు), బ్యాంకర్లు, కిరాణా వ్యాపారులు ఈ నిరసనల్లో పాల్గొంటున్నారు. పెద్ద సంఖ్యలో నిపుణులు ఈ ఆందోళకారులకు అవసరమైన నగదు, రేషన్, షెల్టర్ సమకూర్చుతున్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు ఉచితంగా చదువు చెబుతున్నారు. ఈ నిరసనల ప్రభావం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విద్యా సంస్థలపై తీవ్రంగా పడుతోంది. నిరసనల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతున్న కొద్దీ మిలిటరీ, వారి కుటుంబాలు ప్రజల్లో చులకన అవుతున్నాయి. ఈ కుటుంబాలకు పచారీ సరుకులు సరఫరా చేయొద్దన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. దేశాన్ని స్తంభింపజేయడం ద్వారా మిలిటరీ పాలనను దించేయాలన్న తమ లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో నిరసనకారులు ఉన్నారు.నిరసనలపై లిటరీ ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విరుచుకు పడుతోంది. 'అవాంఛనీయ వ్యక్తుల జాబితా పేరుతో సైన్యం వేటాడదలచుకున్న కొంతమంది పేర్లను, వారి ఫొటోలను విడుదలజేసింది. ఆ జాబితాను సోషల్ మీడియా అకౌంట్లకు, వారి నివాస ప్రాంత చిరునామాకు పంపింది. ఈ జాబితాలో ప్రముఖ కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు ఉన్నారు. తన ఆదేశాలను ధిక్కరించి, శాసనోల్లంఘనకు పాల్పడేవారు ఎంతటివారైనా అరెస్టు చేస్తామని ఆర్మీ బెదిరించింది. అరెస్టులు, వేధింపులు వంటివి రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి.సాయుధ ఉగ్రవాద గ్రూపులు తమ విచ్ఛిన్నకర ఎజెండాతో ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్నాయంటూ సైన్యం కొన్ని ఉగ్రవాద గ్రూపుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ముఖ్యంగా థాయిలాండ్‌తో గల సరిహద్దు ప్రాంత గ్రామాలపై ఇప్పటికే బాంబు దాడులు చేసింది. ఈ దాడుల్లో గ్రామాలకు గ్రామాలే నాశనమవుతున్నాయి. అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేత పెట్టుకుని సరిహద్దుల గుండా ఇతర దేశాలకు శరణార్థులుగా పారిపోతున్నారు. మయన్మార్‌లో జాతుల గురించి కూడా ఇక్కడ ప్రస్తావించుకోవాలి. ఈ దేశంలో దాదాపు 135 దేశీయ జాతులు, తెగలు వున్నాయి. బామర్ జాతి వీటన్నిటిలోకి పెద్దది. మొత్తం దేశ జనాభాలో 50 శాతం దాకా వీరే ఉన్నారు. ఇతర జాతులు మిగతా సగం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. బామర్ జాతి దేశ మధ్య భాగంలో వుండగా, ఇతర జాతులు సరిహద్దులను ఆనుకుని వున్న ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మయన్మార్ భారత్‌తో 1600 కి.మీ పొడవునా సరిహద్దు కలిగివుంది. అలాగే చైనా, థాయిలాండ్, బంగ్లాదేశ్‌లతో కూడా అది విశాలమైన సరిహద్దు కలిగివుంది. మెజార్టీ జాతికి, ఇతర మైనార్టీ జాతులకు మధ్య దీర్ఘకాలంగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వీటిలో చాలా జాతులకు చెందిన గ్రూపులు తమ సొంత సైన్యాన్ని నడుపుతున్నాయి. ఆ ప్రాంతాలపై అవి ఆధిపత్యం చెలాయిస్తుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా మయన్మార్ ప్రభుత్వ దళాలతో అవి పోరాడుతున్నాయి. ప్రస్తుత నిరసనల్లో చాలా వరకు మధ్య మయన్మార్ లోని పట్టణాలు, నగరాల్లోనే జరుగుతున్నాయి. కరెన్ (థాయిలాండ్‌తో గల సరిహద్దును ఆనుకుని ఉన్న ప్రాంతంలో నివసించే జాతి), కచిన్ (చైనాతో గల సరిహద్దును ఆనుకుని ఉన్న ప్రాంతం) ఈ ప్రజాస్వామ్య ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించి, అందులో పాల్గొంటున్నాయి. సైనిక తిరుగుబాటు ద్వారా కూలదోయబడి, ప్రస్తుతం ప్రవాసం నుంచి నడుస్తున్న ఎన్ఎల్‌డి ప్రభుత్వం మార్చి14న పయిదువాంగ్సు హలుత్తావ్ రిప్రజెంటింగ్ కమిటీ (సిఆర్‌పిహెచ్) ఏర్పాటుకు పిలుపునిచ్చింది. ఈ కమిటీ ప్రజలకు తమను తాము రక్షించుకునే హక్కు ఉందని చెబుతోంది. ఈ జాతులకు చెందిన సాయుధ దళాలు ఉగ్రవాద గ్రూపులు, అవాంఛనీయ శక్తులు ఎంతమాత్రం కావని తెలిపింది. అవాంఛనీయ సంస్థలుగా ముద్ర పడిన ఈ గ్రూపులతో కలసి పని చేసేందుకు సిఆర్‌పిహెచ్ మరీ ముఖ్యంగా కాచిన్ రాజకీయపరంగా తాత్కాలిక కో-ఆర్డినేషన్ టీమ్‌ని ఒకదానిని ఏర్పాటు చేసింది. ఫెడరల్ డెమోక్రటిక్ యూనియన్ ఏర్పాటుతో సహా ఉమ్మడి లక్ష్యాల సాధనకు ఈ కమిటీ కృషి చేస్తుంది. అయితే సూకీ, ఆమె బృందం ఈ ఫెడరల్ డెమోక్రటిక్ యూనియన్ విషయంలో ఇప్పటికీ మౌనం వహిస్తున్నారు. రోహింగ్యాలపై దాడులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు సోషల్ మీడియా పోస్టింగ్‌లు పెట్టిన వారు చాలా మంది బాహాటంగా ఇప్పుడు క్షమాపణలు కోరుతున్నారు. వారితో కలసి నిరసనల్లో పాల్గొంటున్నారు. మిలిటరీపై పోరాడేందుకు ఫెడరల్ ఆర్మీ ఏర్పాటు కోసం వారు డిమాండ్ చేస్తున్నారు.దీంతో సైన్యం కూడా ఈ జాతుల సాయుధ గ్రూపులను మచ్చిక చేసుకునే యత్నాలు మొదలు పెట్టింది. దేశంలోనే అత్యంత కరడుగట్టిన సాయుధ గ్రూపుల్లో ఒకటైన రఖీన్‌కు చెందిన అరకాన్ ఆర్మీని ఉగ్రవాద సంస్థగా తాము పరిగణించడం లేదని మిలిటరీ ప్రకటించింది. యావత్ ప్రపంచాన్ని కలచివేసిన రోహింగ్యాలపై దాడులు రఖీన్‌లో అరకాన్ ఆర్మీ పేరుతో సాగినవేనన్న విషయం మనం మరువరాదు. ఈ జాతుల సాయుధ గ్రూపులను బుజ్జగించేందుకు ఎన్ఎల్‌డి చేస్తున్న యత్నాలు ఫలించే సూచనలు కనబడడం లేదని కొందరు వ్యాఖ్యాతలు భావిస్తున్నారు. ఎన్ఎల్‌డి, సూకీ మెజార్టీ జాతికి చెందిన బార్మర్ గ్రూపు ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవారని ఈ సాయుధ గ్రూపులు భావిస్తుండడమే దీనికి కారణంగా వారు చూపుతున్నారు. ఎన్ఎల్‌డి ఒక జాతీయ పార్టీగా ఉండి కూడా ఈ గ్రూపు ప్రయోజనాలను కాపాడడం కోసమే పనిచేస్తోంది.

ఎన్ఎల్‌డి ప్రజాతంత్ర పాలన ప్రయోజనాలు మెజార్టీ జాతికి చెందాయి తప్ప తమ ప్రాంతాలకు ఒనగూడిందేమీ లేదని వారు భావిస్తున్నారు. గత పదేళ్ల ఎన్ఎల్‌డి పాలనలో మైనార్టీ జాతులపై దాడులు పెరగడం, రోహింగ్యాలపై దాడులు జరిగినప్పుడు సూకీ మౌనం వహించడమే దీనికి నిదర్శనం అని వారు చెబుతున్నారు.ఏదేమైనా ఈ ఎత్తులు, పై ఎత్తులు దేశంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేవిగాను, జాతి పరమైన విద్వేషాలు, దాడులకు మరింత ఆజ్యం పోసేవిగాను ఉన్నాయి. ఈ ఘర్షణలు గనుక విస్తరిస్తే భారత్‌తో సహా మయన్మార్‌తో సరిహద్దు కలిగిన అన్ని దేశాలపైన దీని ప్రభావం పడుతుంది.కరెన్ లిబరేషన్ ఆర్మీ (కెఎల్ఎ) అనేది బ్రిటిష్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసింది. మిలిటరీకి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం మరింత దూకుడుగా సాగేలా చూసేందుకు, యువ ఆందోళనకారులతో సన్నిహిత సమన్వయం నెరపేందుకు బిబిసి, రేడియో ఫ్రీ ఆసియా (అమెరికా నిధులతో నడిచేది), వాయిస్ ఆఫ్ అమెరికా వంటి ప్రచార సాధనాలు పనిచేస్తున్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. ఇక్కడ 'వారి ప్రయోజనమేమిటి' అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. మయన్మార్ భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో ఉండడం వల్ల దానిలో వారి ప్రయోజనం ఇమిడి ఉంది. భారత్, చైనాలతో అది విశాలమైన సరిహద్దును కలిగి ఉండడమే కాదు, బంగాళాఖాతంతో కూడా అది అనుసంధానమై ఉంది. బంగాళాఖాతం, మలక్కా జలసంధిపై కంట్రోల్ సాధించగలిగితే, హిందూ మహాసముద్రం లోని జల మార్గాలపై కూడా కంట్రోల్ సాధించినట్టే. దీనిని సాధించడం కోసమే అమెరికా తహతహలాడుతోంది. 'ఆసియా పైవోట్' అన్నా, 'ఇండో-పసిఫిక్ వ్యూహం' అన్నా, 'ఆసియన్ సెంచరీ' అన్నా ఇలా ఏ పేరుతో పిలిచినా దాని అసలు లక్ష్యం ఇదే.మయన్మార్‌లో అశాంతి ఆ దేశాన్ని అరాచకమనే అగాథం లోకి మరింతగా నెడుతున్నది. అమెరికా కోరుకుంటున్నది కూడా ఇదే. అక్కడ పరిస్థితి ఎంతగా దిగజారితే, దానిని ఆసరా చేసుకుని మయన్మార్‌లో చొరబడి, అక్కడ తిష్టవేసేందుకు తనకు అంతగా వీలవుతుందన్నది అమెరికా పన్నాగం. పశ్చిమాసియాను ఇలాగే కల్లోలంలోకి నెట్టింది. ఇప్పుడు తూర్పు ఆసియాను అది లక్ష్యంగా చేసుకుని తనకు బాగా అలవాటైన టక్కుటమార విద్యలను ఇక్కడ ప్రయోగిస్తోంది. ప్రజల్లో వున్న అసంతృప్తిని ఉపయోగించుకుని సాయుధ ఘర్షణలను ప్రేరేపిస్తూ దేశాన్ని అరాచకంలోకి నెట్టడం, తద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసి, పట్టు సాధించాలన్నది సామ్రాజ్యవాద వ్యూహం. ఆఫ్ఘనిస్తాన్ లోను, ఇరాక్ లోను, అటుపిమ్మట పశ్చిమాసియా/ఉత్తర ఆఫ్రికాలో తలెత్తిన 'అరబ్ రివల్యూషన్' సమయం లోను అనుసరించిన జిత్తులమారి ఎత్తుగడలనే ఇప్పుడు మయన్మార్ లోను అది ప్రయోగిస్తున్నది. ఇందుకోసం తన స్లీపింగ్ సెల్స్‌ను అది యాక్టివేట్ చేస్తోంది. మయన్మార్‌లో సామ్రాజ్యవాద పన్నాగాలు ఫలించేందుకు అనుమతించడం చాలా ప్రమాదకరం. చైనాను లక్ష్యంగా చేసుకుని, దాని అభివృద్ధికి చెక్ పెట్టేందుకే అది ఈ ఎత్తుగడలు వేస్తుందనకుంటే పొరపాటు. ఈ కుట్రల వల్ల భారత్ కూడా తీవ్రంగా దెబ్బ తింటుంది. 1991లో (సోవియట్ యూనియన్ పతనమైన తరువాత) అమెరికా ఒక ప్రకటన చేస్తూ, 'సూపర్ పవర్'గా ఎదిగేందుకు ఎవరు యత్నించినా, సహించేది లేదని హూంకరించింది.

ఆ పరిస్థితి గనక వస్తే ప్రపంచంపై తన పెత్తనానికి నూకలు చెల్లుతాయన్న భయం అమెరికాను వెంటాడుతోంది. చివరికి భారత్‌ను కూడా అది సహించదనే విషయం మరువరాదు.మన పొరుగు దేశంలో సామ్రాజ్యవాదులు సాగిస్తున్న పన్నాగాలు, మితిమీరిన జోక్యాలు ఆందోళనకు గురిచేసేవన్న భావన మనకు ఉండాలి. మయన్మార్ ప్రజల ప్రజాతంత్ర ఆర్తిని బలపర్చడంలోను, అక్కడ ఉవ్వెత్తున సాగుతున్న నిరసనలను అణచివేసేందుకు సాగుతున్న అన్ని రకాల నిర్బంధాలను ఖండించడంలోను మనం ఎప్పుడూ ముందుండాల్సిందే.

## ఘాట్ రోడ్డులో వన్యమృగాలు



తిరుమల, ఏప్రిల్ 15, : నిత్యం భక్తుల గోవింద నామాలతో మారుమోగే తిరుమలగిరుల్లో లాక్‌డౌన్‌తో రెండు వారాలుగా నిశ్శబ్ద వాతావరణం నెలకొనడంతో వన్యమృగాలు జన సంచారంలోకి వచ్చేస్తున్నాయి. మనుషుల అలికిడి లేకపోవడంతో శేషాచల అడవుల్లోని జంతువులు తిరుమల వీధుల్లోకి వచ్చి స్థానికులను, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న కల్యాణ వేదిక, శ్రీవారి సేవ సదన్ వద్ద చిరుత, ఎలుగు బంట్లు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మ్యూజియం వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో రేసు కుక్కలు దుప్పిలపై దాడికి దిగిన ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. స్థానికులు నివాసం ఉంటున్న బాలాజీ నగర్, ఈస్ట్ బాలాజీ నగర్లలో సైతం చిరుతలు, అడవి పందులు, దుప్పి, పాముల సంచారం అధికంగా ఉంటోంది. ఇక పాపవినాశనం మార్గంలో గజరాజుల గుంపు సంచరిస్తోంది. ముఖ్యంగా రెండు ఘాట్ రోడ్లలో చిరుతల సంచారం పెరిగింది. నాలుగు రోజుల క్రితం రెండు ఘాట్ రోడ్లను అనుసంధానం చేసే లింక్ రోడ్డులో చిరుత కనపడింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది భయభ్రాంతులకు గురి అయ్యారు. మొదటి ఘాట్ రోడ్డుపై జింకలు, కణితి, దుప్పిలు సైతం గంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. వన్య మృగాలు జనావాసంలోకి వస్తుండడంతో సాయంత్రం తరువాత బయట తిరగరాదని టీటీడీ, పోలీసు అధికారులు స్థానికులకు గట్టి ఆంక్షలు విధించారు. 1900 తర్వాత నుంచి తిరుమలకు భక్తుల రాక క్రమంగా పెరుగుతూ రావడంతో వన్యమృగాలు జనసంచారంలోకి రావడంతో క్రమంగా తగ్గిపోతూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా రెండు వారాలుగా ఆలయం మూత, ఘాట్‌రోడ్లపై రాకపోకల నిషేధంతో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. దీంతో వన్యమృగాలు స్వేచ్ఛగా తిరుమల వీధుల్లోకి ఘాట్ రోడ్లపైకి వచ్చేశాయి. 128 ఏళ్ల క్రితం మాత్రం ఒకసారి రెండు రోజుల పాటు గుడి మూతపడిన సమయంలో ఇలాంటి పరిస్థితి కనిపించింది. అప్పట్లో ఆలయం చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం కావడం, శ్రీవారి ఆలయం మాత్రమే తిరుమలలో ఉండడంతో ఉదయం తిరుపతి నుంచి గుర్రాలపై అర్చకులు తిరుమలకు చేరుకునేవారు. సంధ్యా సమయం మొదలు కాకముందే తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యేవారు. ఇప్పుడు మళ్లీ అలాంటి వాతావరణం కనిపిస్తోంది.



## జెట్ స్పీడ్ తో 'దృశ్యం 2' షూటింగ్ పూర్తి చేసిన వెంకీ..!



మలయాళంలో సూపర్ హిట్ అయిన 'దృశ్యం 2' సినిమాని ఇప్పుడు తెలుగులో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. 'దృశ్యం' సినిమాతో సక్సెస్ అందుకున్న విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో ఈ సీక్వెల్ తెరకెక్కుతోంది. ఆయన భార్యగా సీనియర్ నటి మీనా నటిస్తోంది. మలయాళ వర్షన్ ని డైరెక్ట్ చేసిన జీతూ జోసెఫ్ తెలుగు 'దృశ్యం 2' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై డి. సురేష్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాని సెట్స్ పైకి తీసుకెళ్లారు. మార్చి మొదటి వారంలో ప్రారంభమైన 'దృశ్యం 2' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దాదాపు నెల రోజుల్లోనే హీరో వెంకటేష్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేశాడు. తాజాగా ఈ విషయాన్ని వెల్లడించిన చిత్ర బృందం ఓ ఫోటోని షేర్ చేసింది. 'దృశ్యం' ఫ్యామిలీ చిత్రీకరణ ముగించుకొని ఓ చెట్టు కింద సేదతీరుతున్నట్లు కనిపిస్తోంది. ఇకపోతే ఈ సినిమా షూటింగ్ కూడా చివరి దశకు చేరుకుందని.. త్వరలోనే పూర్తవుతుందని చిత్ర యూనిట్ తెలిపింది. కోవిడ్ పరిస్థితుల్లో పక్కా ప్రణాళికతో సాధ్యమైనంత త్వరగా ఈ సినిమా షూట్ పూర్తి చేయడం గొప్ప విషయమనే చెప్పాలి. కాగా 'దృశ్యం 2' చిత్రాన్ని ఈ ఏడాది ద్వితీయార్థంలోనే విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఆగస్ట్ నెలలో వెంకటేష్ నటిస్తున్న 'ఎఫ్ 3' మూవీ విడుదల ఉంది కాబట్టి జూన్ లేదా జూలైలో 'దృశ్యం 2' ని విడుదల చేయాలని వెంకీ అండ్ టీమ్ ఆలోచన చేస్తోందట. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇదిలా ఉంటే 'నారప్ప' ను రిలీజ్ కి రెడీ చేసిన వెంకీ.. ఇకపై పూర్తి సమయం 'ఎఫ్ 3' షూటింగ్ కి కేటాయించనున్నాడు. ఏదేమైనా వెంకటేష్ ఈ ఏడాది మూడు సినిమాలతో రాబోతున్నాడని చెప్పవచ్చు.

## అడిగిన వెంటనే ఫోన్ నెంబర్ ఇచ్చేసిన హీరోయిన్



ఈమధ్య కాలంలో సెలబ్రెటీలు సోషల్ మీడియాలో అభిమానులతో ఇంటరాక్ట్ అవ్వడం చాలా కామన్ గా జరుగుతుంది. అభిమానులు అడిగే ప్రశ్నలకు వారు సమాధానాలు చెబుతూ మరింత చేరువ అయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే వారు అనేక రకాలైన ప్రశ్నలను ఎదుర్కొంటున్నారు. కొందరు నన్ను పెళ్లి చేసుకో అంటూ అడుగుతుంటే మరి కొందరు మరో రకమైన పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేస్తూ విసిగిస్తున్నారు. అయినా కూడా వారు చాలా ఓపికగా సమాధానాలు చెబుతూనే ఉన్నారు. తాజాగా శృతి హాసన్ అభిమానులతో చిట్ చాట్ నిర్వహించింది. ఎంతో మంది అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పింది. ఈ సందర్భంగా ఆమె కొన్ని వింతైన ప్రశ్నలను కూడా ఎదుర్కొంది. శృతి హాసన్ ను ఒక నెటిజన్ మీ వాట్సప్ నెంబర్ ఇవ్వొచ్చు కదా అంటూ అడుగగా వెంటనే నెంబర్ ఇచ్చేసింది. 100 అంటూ నెంబర్ ఇచ్చిన శృతి హాసన్ ఆ నెంబర్ కు ఫోన్ చేస్తే తాను స్పందిస్తాను అన్నట్లుగా ఫన్నీ సమాధానం ఇచ్చింది. 100 పోలీసు హెల్ప్ లైన్ అనే విషయం తెల్సిందే. సమయస్ఫూర్తితో అభిమాని అడిగిన వెంటనే 100 నెంబర్ ఇవ్వడం ఆమె సెన్సాఫ్ హ్యూమర్ కు నిదర్శనం అంటూ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్నో సిల్లీ అండ్ సీరియస్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పింది. ఇక శృతి హాసన్ ఇటీవల 'వకీల్ సాబ్' సినిమా లో చిన్న పాత్రలో కనిపించిన విషయం తెల్సిందే. ఆ సినిమా సక్సెస్ అయిన నేపథ్యంలో శృతి హాసన్ కు మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి. ఈ ఏడాది క్రాక్ తో మొదలు పెట్టిన శృతి హాసన్ వరుసగా తన తెలుగు.. తమిళం.. హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అవుతూనే ఉంది. తనకు మూడు భాషల సినిమా పరిశ్రమలు ముఖ్యమే అంటూ చెబుతున్న శృతి హాసన్ తెలుగులో తదుపరి సినిమా ఒక స్టార్ హీరోతో ఉంటుందని వార్తలు వస్తున్నాయి. అధికారికంగా త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

## స్టార్ హీరోయిన్ తో స్టార్ హీరో వైఫ్ వంటకాలు



టాలీవుడ్ బాలీవుడ్ లో వరుస సినిమాలతో క్షణం తీరిక లేని షెడ్యూళ్లతో రకుల్ హడావుడి తెలిసినదే. ఓవైపు క్రిష్ సినిమా చేస్తూనే అటు బాలీవుడ్ లో కథలు విని వాటిని ఫైనల్ చేసేయడం వెంట వెంటనే షూటింగులకు పరుగులు తీయడం చూస్తున్నదే. ఇంత బిజీలోనూ రకుల్ ఖాళీ సమయాన్ని వంటల కార్యక్రమంతో సద్వినియోగం చేసింది. అది కూడా తన ఫ్రెండు ఉపాసన రామ్ చరణ్ తో కలిసి హెల్త్ వెబ్ చానెల్ కోసం ఈ వంటల కార్యక్రమంలో ప్రత్యక్షమైంది. స్టార్ హీరో రామ్ చరణ్ భార్యామణి ఉపాసన యువర్ లైఫ్ డాట్ ఇన్ పేరుతో వెబ్ సైట్ ప్రారంభించి ప్రత్యేకంగా లైఫ్ స్టైల్.. ఆరోగ్యం తదితర విషయాలపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఓవైపు అపోలో సేవల గురించి వెల్లడిస్తూనే.. రకరకాల సామాజిక విషయాలపైనా ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. ఇక యువర్ లైఫ్ డాట్ ఇన్ కోసం ఇంతకుముందు సమంత రకరకాల వంటకాల గురించి చెప్పారు. ఇప్పుడు ఫిట్నెస్ ఫ్రీక్ రకుల్ ప్రీత్ సింగ్ ఓ స్పెషల్ వంటకాన్ని పరిచయం చేశారు. ఇందులో ఓ పంజాబీ డిష్ గురించి రకుల్ టిప్స్ చెప్పారు. రోటీ పాలక్ తరహాలో పచ్చని ఆకుకూరతో ఈ వంటకాన్ని రెడీ చేయడంతో అందరికీ నోరూరిపోతోంది. ఇది హెల్దీ సీజనల్ పంజాబీ ఫెస్టివల్ ఫుడ్ అంటూ రకుల్ పరిచయం చేశారు. ఉగాది సందర్భంగా ఈ స్పెషల్ వంటకాన్ని రకుల్ ప్రిపేర్ చేశారట. పండగల వేళ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎలా సింపుల్ స్టెప్స్ లో తయారు చేసుకోవాలో ఈ వెబ్ సైట్లో పూర్తి వీడియో చూడమంటున్నారు ఉపాసన.

## హీరో నుంచి దర్శకుడిగా మారిన వైష్ణవ్ తేజ్!



"నా డ్రీమ్ యాంబిషన్స్ లో డైరెక్షన్ కూడా ఉంది. అసలు ముందుగా డైరెక్టర్ అవుదామనే అనుకున్నాను. కానీ.. తర్వాత హీరోగా మారాను" అని 'ఉప్పెన' ప్రమోషన్స్ లో ప్రకటించాడు మెగా హీరో వైష్ణవ్ తేజ్. అన్నట్టుగానే.. డైరెక్టర్ గా మారాడు. అయితే.. ఇదేదో కొత్త సినిమాకు సంబంధించి కాదు. 'ఉప్పెన' సినిమానే డైరెక్ట్ చేశాడు వైష్ణవ్! అసలు విషయం ఏమంటే.. కొన్ని రోజులుగా ఉప్పెన సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలను రిలీజ్ చేస్తున్నారు బుచ్చిబాబు. తాజాగా మరో మేకింగ్ వీడియోను యూట్యూబ్ లో రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ సేతుపతి కృతిశెట్టి యాక్టింగ్ కు సంబంధించిన విజువల్స్ ఉన్నాయి. అయితే.. కొన్ని సీన్లకు డైరెక్షన్ చేశాడు వైష్ణవ్. మెగాఫోన్ చేతబట్టి యాక్షన్ కట్ అంటూ సందడి చేశాడీ మెగాహీరో. ఇప్పుడు ఈ వీడియో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. మొత్తానికి డైరెక్టర్ అవ్వాలన్న కోరికను మొదటి సినిమా ద్వారానే ఇలా తీర్చేసుకున్నాడని అంటున్నారు. కాగా.. 'ఉప్పెన' చిత్రం భారీ సక్సెస్ సాధించడంతో ఫుల్ హ్యాపీగా ఉన్నారు దర్శకుడు బుచ్చిబాబు. విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న ఈ చిత్రం.. భారీ వసూళ్లు సాధించింది. ఈ సినిమా వందకోట్లు సాధించిందని ప్రకటించారు

## 'బాలయ్య ఎంట్రీతో థియేటర్ దద్దరిల్లిపోద్ది'



'సింహా' 'లెజెండ్' వంటి సూపర్ హిట్స్ తర్వాత నందమూరి బాలకృష్ణ – దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న సినిమా "అఖండ". బాలయ్య ఇందులో ఫ్యాక్షనిస్ట్ గా అఘోరాగా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఇప్పటికే ఈ రెండు గెటప్స్ ని చూపించి సినిమాపై అంచనాలు పెంచేశారు. ముఖ్యంగా అఘోరా గా బాలయ్య ఉగ్రరూపానికి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఇక బోయపాటి శ్రీను గత రెండు చిత్రాలకు ధీటుగా నిలిపేలా 'అఖండ' ను తీర్చిదిద్దుతున్నాడని గ్లిమ్స్–టీజర్ లతో అర్థం అవుతోంది. అయితే ఇప్పుడు నటుడు సమ్మెట గాంధీ చెప్పిన విషయాలతో నందమూరి అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 'అఖండ' సినిమాలో బాలయ్య ఇంట్రడక్షన్ సీన్ కోసం బోయపాటి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని భారీగా రూపొందించడని మనం ఇది వరకే చెప్పుకున్నాం. ఇప్పుడు ఈ సినిమాలో నటిస్తున్న సమ్మెట గాంధీ ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. ఇందులో బాలయ్య ఎంట్రీ సీన్ కి అయితే థియేటర్ మోగిపోతుందని దద్దరిల్లిపోద్దని.. 'సింహా' 'లెజెండ్' సినిమాల కంటే పెద్ద సక్సెస్ అవుతుందని గాంధీ తెలిపారు. "అఖండ" చిత్రాన్ని మే 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో బాలయ్యకు జోడీగా ప్రగ్యా జైస్వాల్ – పూర్ణ నటిస్తున్నారు. థమన్ సంగీతం సమకూరుస్తుండగా.. రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ద్వారకా క్రియేషన్స్ బ్యానర్ పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాడు.


## టూ మచ్ గా బాడీ పెంచేస్తున్న మెగా హీరో



మెగా ఫ్యామిలీ వీరాోలం ఒకరిని మించి ఒకరంర అన్నట్లుగా ఇండస్ట్రీలో సెటిల్ అయ్యేందుకు స్టార్ డంను కొనసాగించేదుకు తీవ్రంగా కష్టపడుతున్నారు. మెగా ఫ్యామిలీ అవ్వడం వల్ల ఎంట్రీ ఈజీగానే దక్కించుకుంటున్న వారు సక్సెస్ లు కొట్టేందుకు మాత్రం సొంత కష్టంను నమ్ముకోవాల్సిందే అనే విషయాన్ని చాలా తొందరగానే తెలుసుకుంటున్నారు. అలా తెలుసుకున్న వెంటనే తాము చేస్తున్న సినిమాల్లో పాత్రలకు ప్రాణం పెట్టి పని చేస్తున్నారు. తద్వారా వారి సినిమాలు మంచి విజయాలను దక్కించుకుంటున్నాయి అంటున్నారు. మెగా హీరో వరుణ్ తేజ్ 'గని' సినిమా కోసం ఏకంగా రెండేళ్ల నుండి కష్టపడుతున్నాడు. బాక్సింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా కు కిరణ్ కొర్రపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. సిద్దుతో కలిసి ఈ సినిమా ను అల్లు బాబీ నిర్మిస్తున్నాడు. పూర్తి స్థాయి సినిమా నిర్మాతగా అల్లు బాబీ మారడం జరుగుతుంది. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ ను ఒలింపిక్స్ బాక్సింగ్ విజేతల వద్దకు ట్రైనింగ్ కోసం పంపించడంతో పాటు ఎన్నో రకాల విద్యలను ఆయనకు నేర్పించడం జరిగింది. గని సినిమా కోసం వరుణ్ తేజ్ చాలా బరువు పెరుగుతున్నాడట. ఈ సినిమాలో కొన్ని సీన్స్ కోసం వరుణ్ చాలా లావు కనిపించాల్సి ఉందట. అందుకోసం నిజంగానే వరుణ్ చాలా బరువు పెరిగినట్లుగా చెబుతున్నారు. ఈమద్య కాలంలో వరుణ్ ను చూస్తే బాహుబలి రేంజ్ లో ఉన్నాడు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారట. రాజమౌళి యాక్షన్ సినిమాకు సరిగ్గా సూట్ అయ్యే పర్శనాలిటీ అంటూ వరుణ్ ను ఉద్దేశించి అంటున్నారట. మరో వైపు వరుణ్ ఎఫ్ 3 సినిమా లో నటిస్తున్నాడు. అనీల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో వెంకటేష్ తో వరుణ్ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న విషయం తెల్సిందే.

## ప్రభాస్ 'ఆదిపురుష్' ఆగిపోయినట్టేనా..?

కరోనా ఉపద్రవం మరోసారి సినీ రంగాన్ని బలంగా తాకింది. ఈ దెబ్బకు సినీ కార్యకలాపాలతోపాటు సాధారణ వ్యాపారాల వరకూ అన్నీ మూతపడ్డాయి. మహారాష్ట్రలో కొవిడ్ సెకండ్ వేవ్ ఉధృతి అంతకంతకూ పెరుగుతుండడంతో.. సినిమా షూటింగుల నుంచి థియేటర్ల వరకు అన్నీ మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఒక రకంగా అక్కడ లాక్ డౌన్ విధించినట్టే లెక్క. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలతోపాటు పార్కులు జిమ్ సెంటర్లు సినిమా థియేటర్లు అన్నీ క్లోజ్ చేయాలని ఆదేశించింది. బుధవారం రాత్రి ఈ ఆదేశాలు జారీచేసిన సర్కారు.. తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. మే 1వ తేదీ వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొంది. దీంతో.. ఆదిపురుష్ చిత్రం షూటింగ్ ఆపేయడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. కాగా.. నిన్నామొన్నటి వరకు ఆదిపురుష్ టీమ్ లో కొందరికి కరోనా వచ్చిందని అందువల్ల షూటింగ్ ఆగిపోయిందని రూమర్స్ ప్రచారంలోకి వచ్చాయి. అలాంటిదేమీ లేదని షూటింగ్ కొనసాగుతోందని క్లారిటీ ఇచ్చారు దర్శకుడు ఓం రౌత్. ఇప్పుడు.. స్వయంగా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో నిజంగానే షూటింగ్ నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు 400 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో... ప్రభాస్ రాముడిగా కనిపించనున్నాడు. సీతగా కృతిసనన్ రావణుడి పాత్రలో సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ చిత్రాన్ని రిల్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.







మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com